

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 12-02-2026 | సంపుటి - 26 | సంచిక -264 | రూ : 4 | పేజీలు: 8


## కొడంగల్ లో ఓటేసిన సీఎం..
# మధిరలో డిప్యూటీ సీఎం

- మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ప్రముఖులు
- మంచిర్యాలలో మంత్రి వివేక్ వెంకటస్వామి
- కేంద్రమంత్రి బండి సంజయ్, కామారెడ్డిలో షబ్బీర్ అలీ..
- సాయంత్రం 5 గంటలకు ముగియనున్న పోలింగ్

2లో





# పట్టణాల్లో ఎక్కువ.. నగరాల్లో తక్కువ

- పురపాలికల్లో 75.88%... నగరపాలికల్లో 66.05% మొత్తంగా 73% పోలింగ్
- ఓటేసిన వారిలో మహిళలే అధికం
- కార్పొరేషన్లలో అత్యధికంగా నల్గొండలో 77.36%.. అత్యల్పంగా నిజామాబాద్‌లో 59.12%
- మున్సిపాలిటీల్లో చౌటుప్పల్‌లో 91.91%, నందికొండలో 59.68% నమోదు
- చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతం
- రేపు ఓట్ల లెక్కింపు

2లో





## మహా శివరాత్రి..
# 43 శైవక్షేత్రాలకు 2243 ప్రత్యేక బస్సులు

- శ్రీశైలం, వేములవాడ, ఏడుపాయలకు
- 14 నుంచి 17 వరకు స్పెషల్ బస్సులు..
- టికెట్ల ధరలు పెంపు
- ముందస్తు రిజర్వేషన్‌కు అవకాశం..
- టీజీఎస్ ఆర్టీసీ ఏర్పాట్లు..

హైదరాబాద్ : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు రవాణా పరమైన అసౌకర్యం కలగకుండా టీజీఎస్ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2243 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి కాగా, ఈనెల 14 నుంచి 16వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులను సంస్థ నడపనుంది. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71తో పాటు రాష్ట్రంలోని కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. తరువాయి 2లో

## నరవణె పుస్తకం బయటకు ఎలా వచ్చింది?
## పెంగ్విన్ సంస్థకు
# ఢిల్లీ పోలీసుల నోటీసులు





2లో

- నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంపై రాజకీయ దుమారం
- పుస్తకం ప్రచురణ కాకముందే బయటకు రావడంపై ఢిల్లీ పోలీసుల ఆగ్రహం
- నేరపూరిత కుట్రకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు

భారత్‌అమెరికా డీల్‌పై మాట మార్చిన వైట్‌హౌస్..
## ఫ్యాక్ట్‌షీట్‌లో కీలక సవరణలు

2లో





## మరో 15 ఏళ్లు మనం ఇలాగే
# బలంగా నిలబడాలి

- ఐక్యంగా ఉంటేనే గుజరాత్ తరహాలో అభివృద్ధి సాధ్యమని స్పష్టం
- ప్రభుత్వ విజయాలను ఎమ్మెల్యేలు ఓన్ చేసుకోవాలని, సభకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశం
- కేంద్రం సహకారంతోనే పోలవరం, అమరావతి, స్టీల్ ప్లాంట్ వంటివి గాడిన పడ్డాయని వెల్లడి
- విభేదాలుంటే అంతర్గతంగా చర్చిద్దామని పవన్ పిలుపు

2లో

# ఆరోపణలు.. ఆందోళనలు.. ఫిర్యాదులు




2లో

- కరీంనగర్‌లో లాఠీఛార్జి.. భాజపా కార్యకర్తలకు గాయాలు
- సంగారెడ్డిలో పార్టీ అభ్యర్థితో దురుసుగా ప్రవర్తించారని సీఐని దూషించిన జగ్గారెడ్డి
- బోధన్‌లో దొంగ ఓట్లు వేస్తున్న 12 మంది అరెస్టు

# మహా శివరాత్రి..
# 43 శైవక్షేత్రాలకు 2243 ప్రత్యేక బస్సులు

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు రవాణా పరమైన అసౌకర్యం కలగకుండా టీజీఎస్ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2243 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి కాగా, ఈనెల 14 నుంచి 16వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులను సంస్థ నడపనుంది. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71తో పాటు రాష్ట్రంలోని కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్లు, తాగునీరుతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్ల టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14 నుంచి 16 వరకు నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15 నుంచి 17 వరకు సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్‌ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తుంది. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు రాష్ట్రంలో ప్రయాణానికి ఉచిత బస్సు రవాణా సదుపాయం యధావిధిగా అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలంకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్‌ను www.tgsrtcbus.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040 69440000, 040234500332లలో సంప్రదించవచ్చని తెలిపారు.



## పట్టణాల్లో ఎక్కువ..
# నగరాల్లో తక్కువ

హైదరాబాద్: రాష్ట్రంలో పుర ఎన్నికలు ముగిశాయి. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా రీపోలింగ్ అవసరం లేదని ఎన్నికల సంఘం వెల్లడించింది. బుధవారం రాష్ట్రంలో జరిగిన పుర ఎన్నికల్లో దాదాపు 73.01 శాతం పోలింగ్ నమోదైంది. 2020 మున్సిపల్ ఎన్నికల్లో ఇది 74.40శాతం. శుక్రవారం 138 కేంద్రాల్లో ఓట్లు లెక్కించనున్నారు. 16న కార్పొరేషన్ల మేయర్లు, ఉపమేయర్లు, మున్సిపాలిటీల ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్ల పదవులకు పరోక్ష ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు నగరపాలక సంస్థల్లోని 412 డివిజన్లు, 116 పురపాలక సంఘాల్లోని 2,569 వార్డుల్లో ఎన్నికలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పలు చోట్ల బారులుదీరారు. మొత్తం 52,17,413 మందిలో 38,09,406 మంది ఓటేశారు. పురపాలికల్లో 75.88 శాతం, నగరపాలక సంస్థల్లో 66.05 శాతం మంది ఓటేశారు. అత్యధికంగా 26,67,025 మంది మహిళలల్లో 19,57,226 మంది (73.39శాతం).. 25,49,750 మంది పురుషుల్లో 18,51,829 (72.63 శాతం) మంది.. 638 మంది ఇతరుల్లో 351 మంది (55.02 శాతం) ఓటింగ్‌లో పాల్గొన్నారు. నగరపాలక సంస్థల్లో అత్యధికంగా నల్గొండలో 77.36 శాతం పోలింగ్ జరగ్గా...అత్యల్పంగా నిజామాబాద్‌లో 59.12 శాతం మంది ఓటేశారు. మొత్తం 2,184 పోలింగ్ కేంద్రాల్లో 10,05,119 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 5,14,475 మంది మహిళలు, పురుషులు 4,90,544 మంది, ఇతరులు 100 మంది ఓట్లు వేశారు. మొత్తం 116 పురపాలికల్లో 2,569 వార్డుల్లో 28,04,274 ఓట్లు పోలయ్యాయి. మహిళలు 14,42,751 మంది కాగా.. పురుషులు 13,61,285 మంది. ఇతరులవి 238 ఓట్లు ఉన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 91.91 శాతం.. చండూరులో 91.52 శాతం, సంగారెడ్డి జిల్లా జిన్నారంలో 90.98 శాతం, భువనగిరిలో 90.95 శాతం మేరకు పోలింగ్ జరిగింది. అత్యల్పంగా నల్గొండ జిల్లాలోని నందికొండలో 59.68 శాతం మంది మాత్రమే ఓటేశారు. ఎన్నికల సందర్భంగా పలు చోట్ల స్వల్ప ఘర్షణలు, వాగ్వాదాలు జరిగాయి.

# ఆరోపణలు.. ఆందోళనలు.. ఫిర్యాదులు

హైదరాబాద్, కరీంనగర్, నల్గొండ, సంగారెడ్డి: దొంగ ఓట్ల ఆరోపణలు.. పరస్పర ఫిర్యాదులు.. ఆందోళనల నడుమ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. అక్కడక్కడా ఘర్షణలు జరగ్గా పోలీసులు సత్వరమే స్పందించి ఇరువర్గాలను శాంతింపజేయడంతో ఎక్కడా పరిస్థితి అదుపుతప్పలేదు. ఒకట్రెండు చోట్ల లాఠీలకు పనిచెప్పారు. కొన్నిచోట్ల ఆందోళనకు దిగిన వారిని అదుపులోకి తీసుకొని వదిలేశారు. కరీంనగర్‌లోని జడ్పీ కార్యాలయం వద్ద పోలీసులు భాజపా కార్యకర్తలపై లాఠీఛార్జి చేశారు. 58వ డివిజన్‌లో భారాస నాయకులు దొంగ ఓట్లు వేయిస్తున్నారని భాజపా కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడికి వెళ్లారు. అక్కడ ఇరువర్గాలకు వాగ్వాదం పెరగడంతో పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. దీంతో ఆరుగురు భాజపా కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌లోని కిసాన్‌నగర్‌లో భారాస కార్యకర్తల్ని బెదిరిస్తున్నారని పోలీసులపై స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మండిపడ్డారు. పోలీసులు భారాస కార్యకర్త ఒకరిని జీప్‌లోకి ఎక్కించగా.. అందులో నుంచి అతన్ని దింపి పోలీసుల వైఖరిని తప్పుబట్టారు. ఈ ఘటనలో ఎమ్మెల్యే సహా ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని యైంటిక్లైన్ కాలనీలో భారాస, కాంగ్రెస్ వర్గీయులు గొడవ పడ్డారు. ఈ క్రమంలో కారు అద్దాలు పగిలాయి.

**సూర్యాపేటలో బాహాబాహీ**

నల్గొండ నగర పాలకసంస్థలోని 10వ డివిజన్‌లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న తనను అక్కడ విధుల్లో ఉన్న డీఎస్పీ దూషించారని ఆరోపిస్తూ భాజపా జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఆందోళనకు దిగారు. మిర్యాలగూడ 29వ వార్డులో సీపీఎం, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య గొడవ జరగ్గా సీపీఎం కార్యకర్తలు గాయపడ్డారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన భారాస మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు కుమారుడు సిద్ధార్థపై కొందరు దాడి చేయడంతో స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ నాయకులు సైతం భారాస నాయకుడు సిద్ధార్థ తమ వర్గీయులపై దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆందోళన చేశారు. మిర్యాలగూడలోని 20వ వార్డులో కాంగ్రెస్ నాయకులు దొంగ ఓటు వేయిస్తున్నారంటూ భారాస పోలింగ్ ఏజెంట్ నిలదీశారు. దాంతో వాగ్వాదం జరిగ్గా... కాంగ్రెస్ నాయకులు ఆయన చొక్కాను చింపడంతో తీవ్రస్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. సూర్యాపేట 13వ వార్డు ఎన్నికల కేంద్రం వద్ద కాంగ్రెస్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ(టీఆర్పీ) కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చిన కాంగ్రెస్ నాయకుడు ఉగ్గం బుచ్చిరాములుపై టీఆర్పీ కార్యకర్తలు దాడి చేయడంతో వారి అనుచరులు సైతం పరస్పరం దాడులు చేసుకున్నారు.

# కొడంగల్ లో ఓటేసిన సీఎం.. మధిరలో డిప్యూటీ సీఎం

హైదరాబాద్: తెలంగాణలోని 116 మున్సిపాలిటీలలో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కొనసాగుతోంది. పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్‌లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. కాసేపట్లో ఆయన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుని ఢిల్లీకి వెళతారని సమాచారం. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధిర మున్సిపాలిటీ పరిధిలోని



9వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కరీంనగర్ జ్యోతి నగర్‌లోని ఎస్సార్ హైస్కూల్ కేంద్రంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగియనుంది.

## నరవణె పుస్తకం బయటకు ఎలా వచ్చింది?
# పెంగ్విన్ సంస్థకు ఢిల్లీ పోలీసుల నోటీసులు

ఢిల్లీ: ప్రముఖ పుస్తక ప్రచురణ సంస్థ 'పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా'కు ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంకు సంబంధించి రాజకీయ దుమారం చెలరేగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ పుస్తకం ప్రచురణ కానప్పటికీ రాహుల్ గాంధీ చేతికి ఈ కాపీ ఎలా చేరుకుందని ఇండియా టుడే డిజిటల్ మీడియాలో కథనం వచ్చింది. ఆ తర్వాత ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగి, ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పుస్తకం లీక్ అయినట్లు పేర్కొంటూ, ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ నేరపూరిత కుట్రకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. ఇంకా ప్రచురితం కాని ఆ పుస్తకానికి సంబంధించి పలు ప్రశ్నలను పోలీసులు సంధించారు. వాటికి పెంగ్విన్ నుండి సమాధానం అడిగారు. ప్రచురణ సంస్థ యాజమాన్యం విచారణలో భాగం కావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం అనుమతి పొందకముందే నరవణె రాసిన ఈ పుస్తకం బయటకు రావడం వివాదంగా మారింది. పుస్తకం ప్రచురితం కాలేదని, మార్కెట్‌లో అందుబాటులో లేదని ప్రచురణ సంస్థ 24 గంటల్లో రెండుసార్లు వివరణ ఇచ్చింది. కానీ లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాత్రం ఆ పుస్తకం మార్కెట్‌లో లభ్యమవుతుందని అన్నారు.

# భారత్‌అమెరికా డీల్‌పై మాట మార్చిన వైట్‌హౌస్..
## ఫ్యాక్ట్‌షీట్‌లో కీలక సవరణలు

ఢిల్లీ: భారత్‌అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై విడుదల చేసిన అధికారిక ఫ్యాక్ట్‌షీట్‌లో వైట్‌హౌస్ నిశ్శబ్దంగా కీలక మార్పులు చేసింది. ఒప్పంద వివరాలు వెల్లడించిన కొన్ని రోజులకే ఈ సవరణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా, భారత్ కొనుగోళ్లకు సంబంధించిన పదజాలాన్ని మార్చడంతో పాటు, కొన్ని వ్యవసాయ ఉత్పత్తులు, డిజిటల్ పన్నుల ప్రస్తావనను తొలగించింది. తొలుత విడుదల చేసిన ఫ్యాక్ట్‌షీట్‌లో, అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు భారత్ "నిబద్ధతతో ఉంది" అని పేర్కొన్నారు. అయితే, సవరించిన వెర్షన్‌లో ఈ పదాన్ని "కొనుగోలు చేయాలని భావిస్తోంది" (intends to buy) అని మార్చారు. ఒప్పందంపై భారత్ వైపు నుంచి ఉన్న కట్టుబాటు తీవ్రతను ఈ మార్పు తగ్గించేలా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో పాటు, అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై భారత్ సుంకాలు తగ్గిస్తుందన్న జాబితా నుంచి "కొన్ని రకాల పప్పుధాన్యాలు" అనే పదాన్ని తొలగించారు. ఇది భారత రైతులకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో ఈ మార్పు ప్రాధాన్యం సంతరించుకుంది. అదేవిధంగా, భారత్ తన డిజిటల్ సేవల పన్నును తొలగిస్తుందన్న వాక్యాన్ని కూడా ఫ్యాక్ట్‌షీట్ నుంచి పూర్తిగా తొలగించడం గమనార్హం. ఈ మార్పులను వైట్‌హౌస్ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఎలాంటి ప్రకటన లేకుండా చేసింది. ఈ సవరణలకు గల కారణాలపై అమెరికా ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక వివరణ రాలేదు. దీంతో ఒప్పందంలోని అంశాలపై ఇరు దేశాల మధ్య అవగాహన విషయంలో స్పష్టత లోపించిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

# మరో 15 ఏళ్లు మనం ఇలాగే బలంగా నిలబడాలి: సీఎం చంద్రబాబు

అమరావతి: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి మరో 15 ఏళ్ల పాటు ఐక్యంగా, బలంగా కొనసాగాలని, అప్పుడే గుజరాత్ తరహాలో సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఏ స్ఫూర్తితో నిలబడ్డామో, అదే ఐక్యతను భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. గడిచిన 20 నెలల్లో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు రాకపోవడం శుభపరిణామమని, ఇదే ఐక్యతతో పనిచేసి ఎమ్మెల్యేలు ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఎన్నికల నాటి కంటే ఇప్పుడు కూటమిపై ప్రజా మద్దతు మరింత పెరిగిందని చంద్రబాబు అన్నారు. "గుజరాత్‌లో బీజేపీ వరుసగా ఐదుసార్లు గెలిచి అధికారంలో ఉంది. ఒకే ప్రభుత్వం సుదీర్ఘకాలం కొనసాగడం వల్లే అక్కడ అభివృద్ధి సాధ్యమైంది. మన రాష్ట్రంలోనూ అదే జరగాలి. మరో 15 ఏళ్ల పాటు మూడు పార్టీలు ఐక్యంగా ప్రజల వద్దకు వెళ్లి



ఓట్లు అడిగే పరిస్థితి రావాలి. అప్పుడే శాశ్వతంగా రాజకీయాల్లో నిలబడగలం" అని ఆయన దిశానిర్దేశం చేశారు.

**ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు**

ఈ సందర్భంగా శాసనసభ్యులకు ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. "అసెంబ్లీ సమావేశాలను ప్రతి సభ్యుడు సీరియస్‌గా తీసుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందరూ సభలోనే ఉండాలి. నేను కూడా సభను పూర్తిగా ఫాలో అవుతాను. సభలో సబ్జెక్టులపై అర్థవంతమైన చర్చలు జరగాలి. ఎదుటివారు తిట్టారని మనం కూడా బూతులు తిట్టకూడదు. ప్రజామోదయోగ్యంగా సభను నడుపుదాం" అని అన్నారు. త్వరలోనే జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు, ఎస్పీలతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి, నియోజకవర్గాల్లో పెండింగ్ పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

**విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం కేంద్రం తన పాలసీనే మార్చుకుంది**

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్లే రాష్ట్రం వేగంగా కోలుకుంటోందని చంద్రబాబు వివరించారు. "వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టామంటే దానికి కేంద్రం చేయూతే కారణం. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం నిధులు ఇవ్వకపోయి ఉంటే అవి ముందుకు కదిలేవి కావు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తున్నామంటే అది కేంద్రం సాయంతోనే. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టేందుకు కేంద్రం తన పాలసీనే మార్చుకుంది. ఫలితంగా, మొదటిసారిగా స్టీల్ ప్లాంట్ ఒక్క నెలలో రూ.54 కోట్ల లాభాలు సాధించింది. సూపర్ సిక్స్‌తో సహా అన్ని పథకాలు అమలు చేస్తున్నామంటే దాని వెనుక కేంద్రం అండ ఉంది. ఈ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి ఎమ్మెల్యే ఓన్ చేసుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూటమి నేతలు ఎదుర్కొన్న అణచివేతను చంద్రబాబు గుర్తుచేశారు. పవన్ కల్యాణ్‌ను విశాఖలో హోటల్ గదికే పరిమితం చేయడం, తన అరెస్టు సమయంలో ఆయనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం వంటి ఘటనలను ప్రస్తావించారు. అలాంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఐక్యంగా నిలబడి గెలిచామని, ఈ స్ఫూర్తిని ఎప్పటికీ మరువకూడదని హితవు పలికారు.

*** కూటమి ధర్మానికి కట్టుబడి ఉందాం: పవన్ కల్యాణ్**

ముఖ్యమంత్రి అభిప్రాయంతో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పూర్తిగా ఏకీభవించారు. గత 20 నెలలుగా ఐక్యంగా పనిచేసి, వైసీపీ ఐదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి ప్రగతి బాట పట్టిస్తున్నామని అన్నారు. "రాష్ట్రాభివృద్ధి కోసం మరో 15 ఏళ్లు కూటమి కలిసి ఉంటుంది. ఐక్యంగా ముందుకు వెళ్తుంది. ఎన్నికల్లో ఏ స్ఫూర్తితో పనిచేశామో, అదే స్ఫూర్తి భవిష్యత్తులోనూ అవసరం. పార్టీల మధ్య ఏవైనా భిన్నాభిప్రాయాలు ఉంటే, వాటిని అంతర్గతంగా కూర్చుని పరిష్కరించుకోవాలి. ప్రతి ఒక్కరూ కూటమి ధర్మానికి కట్టుబడి పనిచేయాలి" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత... జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్..



ప్రజా స్ఫూర్తి, నల్గొండ : నల్లగొండ జిల్లాలో మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. నల్లగొండ పట్టణం బోయవాడ లోని ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంచనీయా సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాటు చేశామని,పోలింగ్ కేంద్రాల పరిధిలో 163 బీఎన్ఎస్ఎస్(144 సెక్షన్) అమలులో ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఐదుగురు లేదా అంతకన్నా ఎక్కువ వ్యక్తులు గుంపులుగా గుమికూడరాదని, పోలింగ్ నిర్వహణకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వద్ద రిజర్వ్ పోలీస్, సివిల్ పోలీసులు, స్ట్రైకింగ్ ఫోర్స్, ప్రత్యేక దళాలతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలు, వీడియో రికార్డింగ్, డ్రోన్ కెమెరాలు,వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేశామని, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రత్యేక పోలీస్ నిఘా కొనసాగుతుందని, ఓటర్లను ప్రభావితం, బెదిరింపులకు గురి చేస్తే డయల్ 100 కు సమాచారం ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## నేటి భారత్ బంద్ కు
# కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

*** డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత..**



ప్రజా స్ఫూర్తి , నల్గొండ : కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించ తలపెట్టిన భారత్ బంద్ కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు నల్గొండ డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక సంస్కరణలు, ఆర్థిక విధానాల వల్ల కార్మికులకు రక్షణ కరువైందని నిరసిస్తూ 10 కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక, రైతు సంఘాల మద్దతుతో దేశవ్యాప్త సమ్మెకు (భారత్ బంద్) పిలుపునిచ్చిందన్నారు. ఈ బంద్‌కు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తూ, పార్టీ శ్రేణులంతా ఈ ఆందోళనలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు..

## పాల్వంచలో హైటెన్షన్...
# పోలీస్ స్టేషన్ ముట్టడి



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో పాల్వంచ పోలీస్ స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దొంగ ఓటు ఆరోపణలతో ఓ మహిళను గంటల తరబడి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారని ఆరోపిస్తూ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో సీపీఐ శ్రేణులు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించాయి.ఈ ఘటనపై వివరణ కోరిన తమ పార్టీ నాయకుడితో సీఐ సతీష్ దురుసుగా ప్రవర్తించారని సీపీఐ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐ క్షమాపణ చెప్పే వరకు వెనక్కి వెళ్లబోమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ ఆవరణలోనే బైఠాయించి నిరసన తెలిపారు.ఈ ఘటనతో పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అదనపు పోలీసు బలగాలను మోహరించారు.

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్..

*** తుది పోలింగ్ శాతం 73.60% నమోదు : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్ , మున్సిపాలిటీలకు సంబంధించిన 2వ సాధారణ ఎన్నికల పోలింగ్ ఈ రోజు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జిల్లాలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, అశ్వరావుపేట , ఇల్లందు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 106 వార్డులకు పోలింగ్ నిర్వహించబడింది.ఎన్నికల ప్రక్రియ మొత్తం సజావుగా కొనసాగిందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని ఆయన అన్నారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,85,348 మంది ఓటర్లలో 1,36,423 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 73.60 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. పురుష ఓటర్లలో 73.70 శాతం, మహిళా ఓటర్లలో 73.51 శాతం, ఇతర వర్గాల్లో 78.95 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. ప్రజలు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఆనందకరమని కలెక్టర్ అన్నారు.మున్సిపాలిటీ వారీగా పరిశీలిస్తే అశ్వరావుపేట మున్సిపాలిటీలో 16,830 మంది ఓటర్లలో 12,849 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 76.28 శాతం పోలింగ్ నమోదు కాగా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1,34,775 మంది ఓటర్లలో 1,00,453 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 74.53 శాతం పోలింగ్ నమోదైంది. ఇల్లందు మున్సిపాలిటీలో 33,723 మంది ఓటర్లలో 23,121 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 68.56 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు.పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిందని, పోలింగ్ ముగిసే సమయానికి కేంద్రాల వద్ద క్యూలో ఉన్న ప్రతి ఓటరికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించినట్లు పేర్కొన్నారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అధికార యంత్రాంగం, పోలీస్ సిబ్బంది, ప్రజలందరికీ జిల్లా ఎన్నికల అధికారి కృతజ్ఞతలు తెలిపారు.



# రాష్ట్రంలో కార్పొరేషన్లలో కాంగ్రెస్ పార్టీదే విజయం..

*** మేయర్ ఎన్నిక తర్వాత ప్రతి డివిజన్ లో ప్రజా దర్బార్..**

*** రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి..**

ప్రజా స్ఫూర్తి, నల్గొండ : కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ పాలనలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, నల్లగొండను అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా బుధవారం నల్లగొండ పట్టణంలోని 33వ డివిజన్ మీర్ బాగ్ కాలనీ నల్లగొండ పబ్లిక్ స్కూల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, పేదల సంక్షేమం గురించి పట్టించుకోలేదని విమర్శించారు. గతంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న వ్యక్తి ఎంజి యూనివర్సిటీ పట్టించుకున్న దాఖలాలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన భవనాలకు రూ.200 కోట్లు కేటాయించడంతో పాటు, ఇటీవల నూతనంగా ఫార్మసీ కోర్సులను మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. నల్లగొండలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు. పేదలకు ఏ సమస్య వచ్చినా వారికి ఎల్లవేళలా అండగా ఉంటారని, నేను బతికున్నంత కాలం పేద ప్రజలను గుండెల్లో పెట్టుకుంటానని పేర్కొన్నారు. మేయర్ ఎన్నిక పూర్తి అయిన తర్వాత ప్రతి డివిజన్లో ప్రజా దర్బారు నిర్వహించి కార్పొరేటర్ ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో 100 ఎకరాల భూమిని సేకరించి దేవరకొండ రోడ్ లో 4000, నార్కట్పల్లి రోడ్ లో 4,000 ఇందిరమ్మ ఇండ్లను 75 గజాలలో కట్టించి పేదలకు అందజేస్తామని తెలిపారు. త్వరలోనే నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని, అంగన్వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని స్పష్టం చేశారు. పట్టణ ప్రజలకు 24 గంటలు తాగునీరు వచ్చే విధంగా 12 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు నిర్మిస్తున్నామని తెలిపారు.

*** కార్పోరేషన్లలో కాంగ్రెస్ పార్టీదే విజయం: మంత్రి కోమటిరెడ్డి**

రాష్ట్రంలో జరుగుతున్న కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికలలో అత్యధిక స్థానాలలో విజయం సాధిస్తామని ఈ సందర్భంగా మంత్రి ధీమా వ్యక్తం చేశారు. 7మున్సిపల్ కార్పొరేషన్లన్నింటిలో గెలుపొందుతామని, 116 మున్సిపాలిటీలలో 110 స్థానాలలో విజయం సాధిస్తామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ హఫీజ్ ఖాన్, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, 33 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి రేగట్టే అండాలు లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.




# పర్యావరణ హిత ఓటింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజీగూడెంలో ఏర్పాటు చేసిన పర్యావరణహిత పోలింగ్ కేంద్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జిల్లా కలెక్టర్ వి. హనుమంతరావు మంగళవారం కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. హరిత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చేసిన చర్యలను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగ మాత్రమే కాకుండా పర్యావరణానికి మేలు చేసే విధంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఈ వినూత్న ప్రయోగం చేపట్టామని తెలిపారు. ప్లాస్టిక్ రహిత వాతావరణం, కాగితం.. వస్త్ర బ్యానర్లు, జూట్ సంచుల వినియోగం, తాగునీటి కోసం మట్టి కుండలు ఏర్పాటు వంటి చర్యలు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. భవిష్యత్తులో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇలాంటి హరిత చర్యలు అమలు చేయాలనే దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటడం, ఓటర్లకు నీడనిచ్చేలా పచ్చ కవచాలు ఏర్పాటు చేయడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే పోసరు ప్రదర్శించడం విశేషంగా ఓటర్లకు గ్రీన్ మెసేజ్ అందేలా ప్రత్యేకంగా అలంకరించడం ఆకట్టుకుందన్నారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. వీల్చైర్లు, ర్యాంపులు, ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం, విశ్రాంతి ప్రదేశం వంటి ఏర్పాట్లను ప్రశంసించారు. సిబ్బంది సమయపాలన, ఓటర్లకు అందిస్తున్న సహకారం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

## చౌటుప్పల్ గడ్డపై
# కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

*** చెరుకు లింగస్వామి గౌడ్**



చౌటుప్పల్,ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు చెరుకు లింగస్వామి గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గాలి బలంగా వీచిందన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 20వార్డుల్లో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కొన్ని వార్డుల్లో మిగతా పార్టీల అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు పోటీ సైతం ఇవ్వకపోవడం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చరిష్మాకు నిదర్శనమన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ పదవి చేపట్టబోతున్నామన్నారు.

# ముగిసిన పోలింగ్...

*** బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం భద్రం**

*** గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న అన్ని పార్టీల అభ్యర్థులు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు ముగిశాయి. ఈసారి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడంతో అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో భద్రంగా ఉంది. జిల్లాలోని ఇల్లందు మున్సిపాలిటీ, నూతనంగా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాలిటీ, కొత్తగూడెం కార్పొరేషన్‌లకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 106 వార్డులు, డివిజన్లు ఉండగా, 540 మంది అభ్యర్థులు వివిధ పార్టీలు, స్వతంత్రులుగా బరిలో నిలిచారు. 1,85,348 మంది ఓటర్లు ఉండగా, 288 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించారు.

*** గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న అన్ని పార్టీల అభ్యర్థులు**

జిల్లాలోని 2 మున్సిపాలిటీలు, 1 కార్పొరేషన్‌కు జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన 504 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్స్‌లలో నిక్షిప్తమైంది. గత వారం రోజులుగా ముమ్మరంగా ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు తమ గెలుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ ఉండగా, అక్కడక్కడ స్వతంత్ర అభ్యర్థులు, మరికొన్ని చోట్ల రెబల్స్ అభ్యర్థులు కూడా గట్టి పోటీనిచ్చారు. పోలింగ్ ముగియడంతో అభ్యర్థులు గెలుపోటములపై అంచనాలు రూపొందించుకుంటున్నారు. ఓట్ల లెక్కింపునకు మరొకరోజు గడువు ఉండటంతో ముందస్తుగానే ఎన్ని ఓట్లు పోలయ్యాయి, అందులో తమకు ఎన్ని ఓట్లు వచ్చాయి అనే అంశాలను తాము నియమించుకున్న కో-ఆర్డినేటర్లతో కలిసి అభ్యర్థులు చర్చించుకుంటున్నారు. అయితే ఎవరికి వారే గెలుపై ధీమా వ్యక్తం చేస్తుండటంతో ఓటరన్న తీర్పు మాత్రం ఎటువైపు ఉందో తెలియాలంటే శుక్రవారం వరకు వేచి చూడాల్సిందే.

# భవిష్యత్తులో కూడా సేవ చేసేందుకు ఎప్పుడూ ముందుంటా



*** కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి**

మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : నేరేడ్మెట్ డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి దంపతులు ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా నేరేడ్మెట్‌లోని తమ కార్యాలయంలో స్థానిక కాలనీల నాయకులతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో ఇతర కార్పొరేటర్లు సాధించలేనన్ని నిధులను తీసుకువచ్చి డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గత ఐదు సంవత్సరాల కాలంలో పార్టీ, కుల, మత భేదాలు లేకుండా అనేక మంది నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తమకు అండగా నిలిచారని, అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.డివిజన్ అభివృద్ధి కోసం సుమారు రూ.168 కోట్ల విలువైన పనులు చేపట్టామని చెప్పారు. ఈ నిధుల సమీకరణలో సహకరించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఎంపీ ఈటెల రాజేందర్‌లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ భవిష్యత్తులో కూడా సేవ చేసేందుకు ఎప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు.నేరేడ్మెట్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో డ్రైనేజ్, రోడ్లు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన పనుల్లో దాదాపు 80-90 శాతం పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన అభివృద్ధి పనులు కూడా కొనసాగుతున్నాయని, త్వరలోనే పూర్తి చేస్తామని మీడియాకు వివరించారు.ప్రజల సహకారంతోనే ఈ స్థాయి అభివృద్ధి సాధ్యమైందని, ముందుకు కూడా అదే విధంగా ప్రజల కోసం పని చేస్తామని కార్పొరేటర్ దంపతులు స్పష్టం చేశారు.

## దుకాణాల వద్ద అక్రమ కార్యకలాపాలు, జూదానికి పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు

*** కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి**

కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : దుకాణాల వద్ద అక్రమ కార్యకలాపాలు, జూదానికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం షాపులు, వ్యాపార సముదాయ యజమానులతో కేపీహెచ్ బీ పోలీసుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వ్యాపారులు చట్టబద్ధ నిబంధనలను కచ్చితంగా పాటించేలన్నారు. షాపులు, వ్యాపార సముదాయాల యాజమాన్యాలు తప్పనిసరిగా జీహెచ్‌ఎంసీ అనుమతి, ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ నమోదు, లేబర్ లైసెన్స్, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అనుమతించిన వేళల్లోనే వ్యాపారాలను నిర్వహించుకోవాలన్నారు. సమయపరిమితులు పాటించాలన్నారు. ప్రజా భద్రత దృష్ట్యా ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలను కవర్ చేసేలా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యాపార అవసరాల కోసం ఫుట్‌పాత్‌లు, రహదారులలను ఇష్టానుసారంగా ఆక్రమించరాదన్నారు. నిబంధనలు పాటించని షాపుల లైసెన్సుల రద్దుకు సంబంధిత శాఖలకు లేఖలు రాస్తామని ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది, కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుకాణాలు, వ్యాపార సముదాయ యజమానులు పాల్గొన్నారు.

## సైబరాబాద్‌లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు

*** బందోబస్తు పరిశీలించిన కమిషనర్**



(సైబరాబాద్, ప్రజాస్ఫూర్తి ) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపల్ ఎన్నికలు నేపథ్యంలో బందోబస్తును సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, ఇతర అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. సీపీ ముందుగా కుత్బుల్లాపూర్ జోన్ లోని మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ఎల్లంపేట మున్సిపాలిటీలోని పలు పోలింగ్ కేంద్రాల్లో పర్యటించారు. అనంతరం జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధి లోని అలియాబాద్ మున్సిపాలిటీలో ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా శేరిలింగంపల్లి జోన్ లోని పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీలలోని ఇంద్రేశం ఎంపీయుపీ స్కూల్, ఇస్నాపూర్ జెడ్పీహెచ్ స్కూల్, చిట్కూల్ ఎంపీపీ స్కూల్ లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి, భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో శేరిలింగంపల్లి డిసిపి సీ.హెచ్. శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ ఇన్ ఛార్జ్ డిసిపి సాయి మనోహర్, ఎస్బీ డిసిపి సుధీంద్ర, క్రైమ్స్ డిసిపి ముత్యం రెడ్డి, డబ్ల్యు అండ్ ఎస్ డబ్ల్యూ డిసిపి సృజన కరణం, పీడీ సెల్ ఏడీసీపీ సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ ఏడీసీపీ పురుషోత్తం, శేరిలింగంపల్లి ఏడీసీపీ ఉదయ్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగి రెడ్డి, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.


## ఓటు హక్కు వినియోగించుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు



పెద్దపల్లి, (ప్రజాస్ఫూర్తి) : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి జిల్లాలోని రామగుండం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావు 28వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## జన్నారంలో ఘనంగా ఎల్లమ్మ బోనాలు





ప్రజాస్ఫూర్తి, ఫిబ్రవరి 11 : జన్నారం : గత ఐదు రోజులుగా జన్నారం గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం రేణుక ఎల్లమ్మ బోనాలు కనుల పండువగా ముగిశాయి. మంగళవారం రాత్రి మహిళలు ఇంటికొక బోనం చొప్పున తీసుకొని వెళ్లి అమ్మవారికి సమర్పించారు. బుధవారం రోజున ఆలయం వద్ద బైండ్ల కులస్తుల చేత పట్నాలు వేసి మేకపిల్లను గావు పట్టారు. ఐదు రోజులు గా జరుగుతున్న ఈ బోనాల పండుగకు గౌడ కులస్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామాలలో ఉన్న అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. బుధవారం ఆలయ సమీపంలోని తాటి చెట్టును 13 మంది గీతా కార్మికులకు ఎక్కి చెట్టు ఒకరి నుంచి ఒకరు కల్లు కుండ ను తీసి అమ్మవారికి సమర్పించారు.

# మోడల్ పోలింగ్ కేంద్రాలలో ఇబ్బందులు లేకుండా చర్యలు

*** జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ..**



ప్రజా స్ఫూర్తి ,నల్గొండ: మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు, జిల్లాలోని 6 మున్సిపల్టీలలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ ఓటర్లకు చేసిన ఏర్పాట్లు, పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం బోయవాడ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటర్లతో మాట్లాడారు. సౌకర్యాలు, ఇబ్బందులపై ఆరా తీశారు. అనంతరం మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 7గంటల నుండి జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలైన్లలో నిలుచున్నారని, పోలింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఓటింగ్ శాతం పెరిగేందుకు అవగాహన కల్పించడం వల్ల ఈ విడత ఓటింగ్ పర్సంటేజ్ పెరిగేందుకు అవకాశం ఉందన్నారు. ఓటర్లకు ఎక్కడ ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నామని, ఏవైనా సమస్యలు వస్తే పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ఏర్పాటు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని సమస్యలపై కంట్రోల్ రూమ్ లోని ఫోన్ నెంబర్ 18004251442 కు తెలపాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా వ్యాప్తంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్, మిర్యాలగూడ , దేవరకొండ, నందికొండ ,హాలియా, చిట్యాల, చండూరు మున్సిపాలిటీలకు సంబంధించి వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల జిల్లా సాదిరణ పరిశీలకులు జి. రమేష్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, స్థానిక తహసిల్దార్ పరశురాం, తదితరులు ఉన్నారు.



## 36కి పైగా డివిజన్లలో ఎర్రజెండా రెపరెపలు ఖాయం

**: కూనంనేని ధీమా**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజా పక్షాన పోరాడుతున్న సిపిఐ అభ్యర్థుల విజయం ఖాయమని, 36కు పైగా డివిజన్లలో ఎర్రజెండా రెపరెపలాడబోతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన ఎన్నికల సరళిని ఆయన 60 డివిజన్ల వ్యాప్తంగా పర్యటించి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటర్లు ఎంతో చైతన్యవంతంగా పాల్గొన్నారని, సిపిఐ ఎన్నికల గుర్తు కంకికొడవలికి ప్రజల నుండి విశేష స్పందన లభించిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల ఉత్సాహం చూస్తుంటే సిపిఐ అభ్యర్థుల మెజారిటీ స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అధికార పక్షానికి బుద్ధి చెప్పిన ఓటరు : ఎన్నికల సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, ఓటర్లను ప్రభావితం చేయాలని చూశారని కూనంనేని విమర్శించారు. అక్కడక్కడ పోలీసుల తీరు వల్ల చిన్నపాటి అసంతృప్తికర సంఘటనలు ఎదురైనప్పటికీ, ప్రజలు శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. అధికార పక్ష ప్రలోభాలను కాదని, ప్రజా సమస్యలపై నిలబడే సిపిఐకే ఓటర్లు పట్టం కట్టారని ఆయన విశ్లేషించారు. యంత్రాంగానికి అభినందనలు : ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా సాగేలా కృషి చేసిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ , ఎస్పీ రోహిత్ రాజు కి కూనంనేని అభినందనలు తెలిపారు. రెండు రోజుల్లో జరగబోయే ఓట్ల లెక్కింపులో ప్రజల తీర్పు స్పష్టంగా వెల్లడవుతుందని, కొత్తగూడెం అభివృద్ధిలో సిపిఐ కీలక పాత్ర పోషించబోతోందని ఆయన స్పష్టం చేశారు.



## చిట్టిరామవరంలో ఉద్రిక్తత

*** కాంగ్రెస్ – సీపీఐ మధ్య మాటల యుద్ధం**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్ చిట్టిరామవరంలో ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, సీపీఐ వర్గీయుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణాత్మక పరిస్థితులకు దారితీసింది.ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీపీఐ కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా పోలీసుల తీరుపై విమర్శలు గుప్పించారు. పోలీసులు అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ఒకవైపు మద్దతు ఇవ్వడం సరైంది కాదని పేర్కొన్నారు. చిట్టిరామవరం, వన్ దాస్ గడ్డ ప్రాంతాలు పేదలు, కార్మికులు, గిరిజనులు నివసించే ప్రాంతాలని, అక్కడ ఎన్నికలు ప్రశాంతంగా జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. ధనబలం, అధికార బలం ఉపయోగించి సామాన్య అభ్యర్థిని ఓడించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. డివిజన్ పరిధిలోకి బయటి వ్యక్తులను అనుమతించకూడదని పోలీసులకు తెలియజేశామని చెప్పారు.కమ్యూనిస్టు పార్టీగా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరిస్తున్నామని, దౌర్జన్యాలకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. స్థానిక సమస్యల ఆధారంగానే ఎన్నికలు సాగాలని, ప్రజలకు నచ్చిన ఎజెండాకు వారు ఓటు వేస్తారని సాబీర్ పాషా తెలిపారు.ఇదిలా ఉండగా, ఘటనపై సమాచారం అందుకున్న ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సీపీఐ శ్రేణుల ప్రవర్తనే గొడవకు కారణమైందని కాంగ్రెస్ నాయకులు ఎంపీకి వివరించారు.పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.




## చౌటుప్పల్ లో 91.91 పోలింగ్ శాతం నమోదు




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు బుధవారం జరిగాయి. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో 20వార్డులకు గాను, 17వ వార్డు ఏకగ్రీవం కాగా, మిగిలిన 19వార్డులకు ఎన్నికలు జరిగాయి. 19వార్డుల్లో మొత్తం 25,801 ఓటర్లు ఉండగా, అందులో 12,963 మంది మహిళలు, 12,838 మంది పురుష ఓటర్లుండగా, సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 11,931మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, 11,782 మంది పురుషులు ఓటేశారు. మొత్తం 23,714మంది ఓటర్లు హక్కు వినియోగించుకోగా, ఓటింగ్ శాతం 91.91గా నమోదైంది.

## పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కొత్తగూడెం,ఇల్లందు అశ్వరావుపేటలలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళని పరిశీలించి అక్కడ విధుల్లో ఉన్న అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలతో పాటు ఇల్లందులో స్ట్రాంగ్ రూమ్ ల వద్ద బందోబస్తును పరిశీలించారు.మూడు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.


## కొండెంగ దాడితో వ్యక్తి తీవ్ర గాయాలు

*** చికిత్స పొందుతుండగా సర్పంచ్ పరామర్శ**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన పర్వతం రాజు అనే వ్యక్తిపై కొండెంగ దాడి చేసింది. ఈ దాడిలో రాజుకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ క్రమంలో అతను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. రాజు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అయితే పర్వతం రాజుది రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. ఇంటి పెద్ద కొండెంగ దాడిలో గాయపడి వైద్య చికిత్స పొంది ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. దీంతో అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి ఇబ్బంది కరంగా మారింది. ప్రభుత్వం తమ నిరుపేద కుటుంబానికి పరిహారం అందించి ఆదుకోవాలని రాజు, అతని కుటుంబ సభ్యులు కోరారు.

## డి నాగరంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై 16వ విడత సామాజిక తనిఖీ సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఉపాధి హామీలో జరిగిన పనులను, పనులకు జరిగిన ఖర్చులను చదివి వివరించారు. అదేవిధంగా అవసరమైన పనులను నమోదు చేసుకున్నారు. అనంతరం మహిళా భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు బొమ్మ అమరావతి, గట్టు ప్రశాంత్, దోనూరు కిరణ్ రెడ్డి, ఊదరి రమేష్, బొమ్మ శ్వేత, పాక రాము, సెక్రటరీ పద్మజ గ్రామ పెద్దలు బొమ్మ మైసయ్య, బొంగు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాజధానిలో నయా పాలన షురూ



హైదరాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహా నగరంలో కొత్త పరిపాలన వ్యవస్థ ఆరంభమైంది. జీహెచ్ఎంసీ పరిధిని మూడు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉదయాన్నే ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వెంటనే కార్పొరేషన్లకు కమిషనర్ల నియామకం, మూడింటికీ ప్రత్యేక అధికారి నియామకం, పరిపాలన వ్యవహారాలకు సంబంధించిన పలు ఉత్తర్వులను విడుదల చేసింది. అదే వేగంతో అధికారులూ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత కమిషనర్ ఆర్వీ కర్ణన్ నూతన జీహెచ్ఎంసీ పగ్గాలు చేపట్టారు. సైబరాబాద్ నగరపాలక సంస్థ(సీఎంసీ) కమిషనర్‌గా జి.సృజన హైటెక్‌సిటీలోని న్యాక్ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఆఫీసులో బాధ్యతలు స్వీకరించారు. తార్నాక చౌరస్తాలోని పాత హెచ్ఎండీఏ భవనంలో ఏర్పాటైన మల్కాజిగిరి నగరపాలక సంస్థ(ఎంఎంసీ) కార్యాలయంలో టి.వినయ్‌కృష్ణారెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఫిబ్రవరి 10తో గ్రేటర్ హైదరాబాద్ పాలకమండలి గడువు పూర్తయినందున... మేయర్ స్థానంలో స్పెషల్ ఆఫీసర్‌గా పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ మూడు కార్యాలయాలకు వెళ్లి బాధ్యతలు తీసుకున్నారు. పాలకమండలి లేదనే లోటు తెలియకుండా.. ప్రజలకు జవాబుదారీ, పారదర్శక పాలన అందించాలని కమిషనర్లకు సూచించారు. పురపాలకశాఖ నుంచి పూర్తి సహకారం ఉంటుందని, అందరూ స్వేచ్ఛగా, నగరాభివృద్ధి కోసం పని చేయాలని చెప్పారు.

**కొత్త పరిపాలన వ్యవస్థ**

ఇప్పటి వరకు జీహెచ్ఎంసీలో 300 డివిజన్లు, 12 జోన్లు, 60 సర్కిళ్ల వారీగా పరిపాలన సాగింది. జీహెచ్ఎంసీ చట్టం 1955లోని సెక్షన్ 3(1)ను ప్రకారం... గ్రేటర్ పరిధిలోని ఆరు జోన్లు, 30 సర్కిళ్లు, 150 డివిజన్లతో జీహెచ్ఎంసీ; మూడు జోన్లు, 16 సర్కిళ్లు, 76 డివిజన్లతో సీఎంసీ; మూడు జోన్లు, 14 సర్కిళ్లు, 74 డివిజన్లతో ఎంఎంసీని ఏర్పాటు చేస్తూ సర్కారు ఉత్తర్వు జారీ చేసింది. నూతన కార్పొరేషన్లన్నీ బుధవారం నుంచి వేర్వేరుగా జీహెచ్ఎంసీ చట్టాన్ని అనుసరించి పరిపాలన చేయాలని సర్కారు స్పష్టం చేసింది.

# మేడ్చల్ లో ప్రశాంతంగా ఎన్నికలు

* **పరిశీలించిన కలెక్టర్ మను చౌదరి**

(మేడ్చల్ జిల్లా, ప్రజాస్ఫూర్తి) : మేడ్చల్ జిల్లాలోని మున్సిపాలిటిల ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మున్సిపల్ కార్పొరేషన్ ల సాధారణ ఎన్నికల 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలోని పోలింగ్ బూతులలో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను ను సాధారణ ఎన్నికల పరిశీలకులు నిర్మల కాంతి వెస్లీ తో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. బుధవారం ఉదయం మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఆలియాబాదులోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో, మూడుచింతలపల్లి లోని జగ్గన్ గూడ లో గల జిల్లా పరిషత్ హై స్కూల్ లో, ఎల్లంపేట్ మున్సిపాలిటిలోని రాజబొల్లారంలో గల ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ లలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతులలో నిర్వహిస్తున్న ఓటింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్, అబ్జ్వర్వర్ లు తనిఖీ చేసారు. బూతులలో పోలింగ్ విధానాన్ని పరిశీలించి ఇప్పటివరకు ఎంత మంది ఓటు వేసారని ప్రిసైడింగ్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూతులలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసారా అని, వీల్ ఛైర్, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీ లో







ఉదయం నుంచి ఓటర్లు తమ ఓట్టు హక్కును వినియోగించుకోవడం జరిగింది. జిల్లా కలెక్టర్ మను చౌదరి ఎన్నికల పోలింగ్ బూత్ లను పరిశీలించారు. ఓటర్ లతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓటు వేయడానికి వీల్ ఛైర్ లో వచ్చిన వృద్ధురాలితో మీ పేరు ఏమిటి, ఎంత వయసు అని కలెక్టర్ అడుగగా, తన పేరు కిష్టమ్మ, తన వయసు 65 సంవత్సరాలని ఓటు వేయడానికి వచ్చానని ఆనందంగా తెలియజేసింది.

* **ముడుచింతలపల్లిలో అత్యధిక ఓటింగ్**

జిల్లా లో అత్యధికంగా ముడుచింతలపల్లి మండలంలో అత్యధికంగా 89.06 శాతం పోలింగ్ నమోదైంది. ఎల్లంపల్లి మున్సిపాలిటీ లో 83.27w

అలియాబాద్ మున్సిపాలిటీ లో ఓటింగ్ ముగిసే సమయానికి 79.62 నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

## ఏసీపీతో వాగ్వాదానికి..
# దిగిన ధర్మపురి అర్వింద్

* **నిజామాబాద్ బూత్ నెంబర్ 7లో ఓ కానిస్టేబుల్ కాంగ్రెస్ కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న అర్వింద్**
* **కానిస్టేబుల్ తప్పు చేస్తే మీరు చేసినట్టేనని ఏసీపీతో అర్వింద్ వాగ్వాదం**
* **ప్రత్యర్థి పార్టీలు కుల ప్రస్తావన తీసుకురావడంపై ఆగ్రహం**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కాసేపట్లో ముగియనుంది. మరోవైపు పోలింగ్ సందర్భంగా నిజామాబాద్ లో ఓ సంఘటన చోటుచేసుకుంది. నిజామాబాద్ పరిధిలోని బూత్ నెంబర్ 7లో శంకర్ అనే కానిస్టేబుల్, మరో మున్సిపల్ ఉద్యోగి కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలంటూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారనే సమాచారం తమకు అందిందంటూ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అక్కడకు చేరుకున్నారు. వారి తీరుపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న ఏసీపీతో ఆయన వాగ్వాదానికి దిగారు. మీ కానిస్టేబుల్ తప్పు చేస్తే... మీరు చేసినట్టేనని అన్నారు. మరోవైపు, వినాయక్ నగర్ డివిజన్ లో అర్వింద్ తో బీజేపీ కార్యకర్తలు



మాట్లాడారు. ఓ డివిజన్ లో ప్రత్యర్థులు కుల ప్రస్తావన తెస్తున్నారని కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై అర్వింద్ స్పందిస్తూ... క్యాస్ట్ ఫీలింగ్ తెచ్చేవారిని ఒక్కటే అడగాలని... కశ్మీర్ లో, బంగ్లాదేశ్ లో హిందువులను కులం అడిగి చంపారా? లేదా హిందువులు అని చంపారా? అని అడగాలని చెప్పారు.

## జనగణన నోటిఫికేషన్ తర్వాత
# కార్పొరేషన్ల ఏర్పాటు చట్టవిరుద్ధం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: జనగణన నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నోటిఫికేషన్ ప్రకారం సరిహద్దులకు సంబంధించి మార్పులు చేర్పులు 2027 మే వరకు చేయకూడదని ఉన్నప్పటికీ.. ఈ విధంగా చేయడం చట్టవిరుద్ధమన్నారు. మరోవైపు మున్సిపల్ ఎన్నికలు జరుగుతుంటే అనేక మంది ఐఏఎస్‌లను బదిలీ చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ అసలు ఉందా? వాళ్లు రూపకల్పన చేసిన విధి విధానాలు అమలు చేస్తున్నారా? అనే అనుమానం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలపై భాజపా అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ ఎన్నికల కమిషన్, పోలీసుల



నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రభుత్వం జీహెచ్ఎంసీపై పెత్తనం చేస్తూ.. గ్రేటర్ పరిధిలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తోందని ఆరోపించారు. కేరళ ఎన్నికల కోసం ఆర్ఆర్ ట్యాక్స్ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడత పంపించిందని విమర్శించారు. మూసీ ప్రక్షాళన చేయాలని భాజపా కూడా కోరుకుంటోందన్నారు. మంచి పని చేస్తామంటే ఎవరూ వద్దంటారని.. చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఎట్లా చేస్తారని ప్రశ్నించారు. డబ్బు, అధికార మదంతో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవాలని ప్రయత్నం చేసిందని దుయ్యబట్టారు. ఇంత పెద్దఎత్తున అధికార దుర్వినియోగం ఎప్పుడూ జరగలేదన్నారు. ఏ పార్టీ నుంచి గెలిచినా కాంగ్రెస్ పార్టీ బలపరిచే ఛైర్మన్‌కు మద్దతు ఇవ్వాలని ఇప్పటి నుంచే బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. విజయం సాధించిన ఏ ఒక్క భాజపా అభ్యర్థికి ఏదైనా జరిగితే రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని హెచ్చరించారు.

# 90 శాతం మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌దే విజయం



హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా కనిపించిందని, 90 శాతం కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు తమ పార్టీ ఖాతాలో పడనున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే.. అత్యధిక స్థానాల్లో హస్తం పార్టీ ఆధిక్యం సాధించబోతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పట్టణ ఓటర్లు పట్టం కట్టారని తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై రాష్ట్ర ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్న విషయాన్ని ఈ ఫలితాలు స్పష్టం చేస్తాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణ మాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు వంటి కార్యక్రమాలు ప్రజల మనసులను గెలుచుకున్నాయని వివరించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగుదలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు.. ఓటర్లలో సానుకూల భావనను కలిగించాయని చెప్పారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పీసీసీ అధ్యక్షుడు ధన్యవాదాలు తెలిపారు.

# సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధప్రకాశ్



హైదరాబాద్: ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్న డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాశ్‌ను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ)గా ప్రభుత్వం నియమించింది. ఆ పదవిలో పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న డి.కృష్ణ భాస్కర్‌ను రిలీవ్ చేసింది. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్‌ను కొనసాగించింది. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ జి.శ్రీజనను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేయడంతోపాటు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డిని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించింది. వీరితోపాటు పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలు, నియామకాలపై బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు.

* సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌కు ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనకు ఇప్పటికే ఉన్న గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు కొనసాగుతాయి.
* ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు.. ప్రణాళికా శాఖ ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.
* సెర్ప్ సీఈవో డి.దివ్యకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారు.
* సెర్ప్ అదనపు సీఈవో పి.కాత్యాయనీదేవిని ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా బదిలీ చేశారు. ఎస్ఎఫ్‌సీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతల్లోనూ ఆమె కొనసాగుతారు.
* జల మండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా మయాంక్ మిట్టల్‌ను నియమించారు.
* పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శిగా యు.రఘురాం శర్మను నియమించారు. ఐటీ శాఖ మంత్రికి ఓఎస్డీగా అదనపు బాధ్యతల్లోనూ ఆయన కొనసాగుతారు.

# అడుగడుగునా కాంగ్రెస్ అధికార దుర్వినియోగం: హరీశ్‌రావు

హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో.. ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ వరకూ కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆక్షేపించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించడం, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హేయమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు.




చట్టాన్ని లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమని ఖండించారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అధికార పార్టీ అకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ శ్రేణులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌పై విశ్వాసంతో ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు చెప్పారు.

# ఖర్గేతో సీఎం భేటీ

దిల్లీ: రాష్ట్ర రాజకీయాలు, పరిపాలన అంశాలపై పార్టీ పెద్దలతో చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం దిల్లీ చేరుకున్నారు. రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. దావోస్ పర్యటన, హార్వర్డ్‌లో జరిగిన శిక్షణ, మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన విషయాలను వివరించారు. రేవంత్‌రెడ్డి గురువారం కొందరు కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి. పార్లమెంటుకు వెళ్లి ఎంపీలను కలిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించాయి.



# నేల తల్లిని రసాయనాలతో శల్యం చేయొద్దు

మోపిదేవి: జన్మనిచ్చిన అమ్మలాంటి ధరిత్రిని రసాయనాలతో శల్యం చేయొద్దని రైతులకు చినజీయర్ స్వామి సూచించారు. సుఫల రైతు పాదయాత్ర రెండోవిడతను ఏపీలోని కృష్ణా జిల్లా మోపిదేవిలో బుధవారం ప్రారంభించి, 7 గ్రామాల్లోని పొలాల మీదుగా 8 కిలోమీటర్లు నడిచి అయోధ్య గ్రామంలో ముగించారు. మన మట్టి, మన ఆరోగ్యం, భూ పరిరక్షణ కోసం రైతుల్లో చైతన్యం తీసుకురావడం ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. పాలేకర్ సూచించిన ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పాటించేలా రైతుల్లో మార్పు తీసుకురావాలన్న సంకల్పంతో తాను చేస్తున్న కృషికి తోడ్పాటు ఇవ్వాలన్నారు. మన్నును అన్నంగా మార్చే రైతు పాదమే రామ పాదంగా పంట పొలాలు వేలమంది పాదస్పర్శతో పునీతమై మార్పునకు నాందిగా మారాలన్న ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం పలికామన్నారు. ప్రకృతి వ్యవసాయదారు విజయరామ్, కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, కోనేరు కరుణాకర్‌లు ఈ యజ్ఞంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. వారిద్వారా రైతులు గోవులను పెంచితే పాల ఉత్పత్తి పెరిగి గోఆధారిత ప్రకృతి వ్యవసాయానికి, నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు దేశానికి అందించే అవకాశాలు మెరుగు పడతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేంద్రియ వ్యవసాయం వైపు రైతుల దృష్టి మరల్చడానికి చేస్తున్న కృషిని కొనియాడారు.



నేల తల్లి రుగ్మతతో బాధపడుతోందని, కలుషిత రసాయనాలతో పండించే పంటలు తింటూ ప్రజలు అనారోగ్యం బారిన పడి లక్షల రూపాయలు వైద్యం కోసం ఖర్చుచేస్తూ అప్పుల ఊబిలో మునిగిపోతున్న తీరు హృదయ విదారకమని పేర్కొన్నారు. మండలి వెంకట్రామ్, తహసీల్దార్ హరనాథ్, ఎస్.ఐ గౌతమ్‌కుమార్, భక్తులు, రైతులు పాల్గొన్నారు.

# వందే భారత్ ఛార్జీలు.. చైనా, జపాన్‌ల కన్నా తక్కువే - రైల్వే మంత్రి

వందే భారత్ ఏసీ ఛైర్ కార్‌లో ఛార్జీలు అందుబాటు ధరలోనే ఉన్నాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 300 400 కిలోమీటర్ల మధ్య ప్రయాణానికి కిలో మీటరుకు దాదాపు రూ.2.19 మాత్రమే ఛార్జీ వసూలు చేస్తున్నామని అన్నారు. చైనా, జపాన్, ఫ్రాన్స్ దేశాల్లోని ఇటువంటి సర్వీసుల టికెట్ ధర కంటే ఇది తక్కువేనని అన్నారు. ఆయా దేశాల్లో కిలోమీటరుకు రూ.7 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఈ మేరకు లోక్‌సభలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.



**పొరుగు దేశాలతో పోల్చినా..**

పొరుగు దేశాల రైల్వేల్లో సాధారణ తరగతులతో పోలిస్తే మనదగ్గరే ఛార్జీలు తక్కువని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో కిలోమీటరుకు ఛార్జీ 20 పైసలుగా ఉండగా.. పాకిస్థాన్‌లో 54 పైసలు, బంగ్లాదేశ్‌లో 37 పైసలు, శ్రీలంకలో 51 పైసలుగా ఉందన్నారు. వివిధ వర్గాల ప్రయాణికుల సేవలకు టికెట్ ధరలను నిర్ణయించేటప్పుడు.. సేవలకు అయ్యే ఖర్చు, అందిస్తున్న సదుపాయాలు, ప్రయాణికుల స్తోమత, ఇతర రవాణా సదుపాయాల్లో ఉన్న ఛార్జీలు, సామాజిక ఆర్థిక అంశాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. 2019 ఫిబ్రవరిలో వందే భారత్ సర్వీసులు ప్రారంభించామని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 82 రూట్‌లలో 164 సర్వీసులు సేవలందిస్తున్నాయని చెప్పారు. ప్రయాణికుల సర్వీసు విభాగంలో ఈ రైళ్లు ఎంతో ప్రత్యేకమైనవన్నారు. సస్పెన్షన్ సిస్టమ్, వేగం, ఆటోమేటిక్ ప్లగ్ డోర్లు, సౌకర్యవంతమైన సీట్లు, మినీ ప్యాంట్రీ, సీసీ టీవీలు, కవచ్ వంటి అత్యాధునిక వ్యవస్థలు ఈ రైళ్లలో ఉన్నాయన్నారు. ప్రయాణికుల స్తోమతను దృష్టిలో ఉంచుకొని ఈ రైళ్లలో ఛార్జీలను తక్కువగా ఉండేలా చూసుకున్నామని రైల్వే మంత్రి వెల్లడించారు.

# మావోయిస్టు పేరుతో బెదిరింపు లేఖ... స్పందించిన కందుల దుర్గేశ్

* ఎవరో ఉద్దేశపూర్వకంగా రాసి ఉంటారని మంత్రి అనుమానం
* తన కుటుంబం ఆందోళన చెందుతోందన్న కందుల దుర్గేశ్
* శాఖాపరంగా, వ్యక్తిగతంగా ఎక్కడా తప్పు చేయలేదన్న మంత్రి



మావోయిస్టుల పేరుతో వచ్చిన బెదిరింపు లేఖపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ స్పందించారు. ఈ బెదిరింపు లేఖతో తన కుటుంబం ఆందోళన చెందుతోందని ఆయన అన్నారు. మావోయిస్టులు బెదిరింపు లేఖ రాసేంత ఏమీ లేదని అన్నారు. ఎవరో ఉద్దేశపూర్వకంగా ఈ లేఖ రాసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. తన పర్యాటక శాఖ చాలా చిన్నదని గుర్తు చేశారు. వ్యక్తిగతంగా, శాఖాపరంగానూ తాము ఎక్కడా తప్పు చేయలేదని మంత్రి పేర్కొన్నారు. అందుకే ఎవరో కావాలని లేఖలు రాసినట్లుగా అర్థమవుతోందని పేర్కొన్నారు. తనకు వచ్చిన బెదిరింపు లేఖలపై విచారణ కొనసాగుతోందని అన్నారు. కాగా, కందుల దుర్గేశ్ సహా నలుగురు ఏపీ మంత్రులకు మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖ వచ్చిన విషయం తెలిసిందే. అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, కొల్లు రవీంద్రలకు కూడా బెదిరింపు లేఖలు వచ్చాయి.

# ఎప్‌స్టీన్‌ను కలిశా.. కానీ రాహుల్ ఆరోపణలపై కేంద్రమంత్రి క్లారిటీ

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన 'ఎప్‌స్టీన్' ఆరోపణలను కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురీ తీవ్రంగా ఖండించారు. ఇంటర్నేషనల్ పీస్ ఇనిస్టిట్యూట్ బృందంలో భాగంగా తాను ఎప్‌స్టీన్‌ను కలిశానని చెప్పారు. "ఐపీఐలో మా బాస్‌కు ఎప్‌స్టీన్ తెలుసు. కొన్ని సందర్భాల్లో మాత్రమే సమావేశమయ్యాను. కచ్చితంగా చెప్పాలంటే మూడునాలుగు సార్లు. ఒక్కసారి మాత్రమే ఈమెయిల్ చేసుకున్నాం. అతడిపై వచ్చిన ఆరోపణలకు మా మధ్య జరిగిన సంభాషణకు ఎలాంటి సంబంధం లేదు" అని వెల్లడించారు. ఇదంతా అసత్య ప్రచారమంటూ రాహుల్



వ్యాఖ్యలపై మండిపడ్డారు. బడ్జెట్‌పై ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి ప్రస్తావించిన సంగతి తెలిసిందే. అప్పుడు అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్ సింగ్ పేర్లను ప్రస్తావించారు. "ఈ రోజు విపక్షనేత పార్లమెంట్‌లో కొన్ని విషయాలు మాట్లాడారు. ఆయనకు నిరాధార ఆరోపణలు చేయడం అలవాటు. మన రాజకీయ వ్యవస్థలో రెండురకాల నేతలు ఉంటారు. బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ.. సామాజిక సేవకే జీవితాన్ని అంకితం చేస్తుంటారు. మరికొందరు అప్పుడప్పుడు దేశానికి వస్తారు. వారికి పార్లమెంట్‌లో తగిన సమాధానం ఇచ్చినప్పుడు వినకుండా సభ నుంచి వాకౌట్ చేస్తుంటారు" అని రాహుల్ తీరును విమర్శించారు. అమెరికా (USA) ప్రభుత్వం ఇటీవల 30 లక్షల 'ఎప్‌స్టీన్' పేజీలను బయటపెట్టింది. వీటితోపాటు 2,000 వీడియోలు, 1,80,000 ఫొటోలనూ విడుదల చేసింది. ప్రజాసంఘాలు, రాజకీయంగా వచ్చిన ఒత్తిడి కారణంగా రూపొందించిన ఎప్‌స్టీన్ ఫైల్స్ ట్రాన్స్‌పరెన్సీ యాక్ట్ కింద వీటిని విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖులతో సంబంధాలు నెరిపిన ఎప్‌స్టీన్ 2019లో న్యూయార్క్ జైల్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మైనర్ బాలికలను అక్రమరవాణా చేశాడన్న ఆరోపణలపై విచారణ ఎదుర్కొన్నాడు. అతడి మాజీ గర్ల్‌ఫ్రెండ్ గిస్లైన్ మ్యాక్స్‌వెల్‌కు 2021లో 20 ఏళ్ల జైలు శిక్షపడింది





# భారత్ అభివృద్ధిని.. కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోంది : కేంద్రమంత్రి

అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం అభివృద్ధిపథంలో ఉండడాన్ని చూసి కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోందని.. అందువల్లే ఆ పార్టీ నేతలు ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు కలిగించేలా ఉందనే ఆధారాలు చూపాలని రాహుల్‌కు సవాల్ విసిరారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడి స్థానానికి తగిన నేత కాంగ్రెస్‌లో లేకపోవడం దురదృష్టకరమన్నారు. రాహుల్ ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురీపై లోక్‌సభలో తీవ్రమైన ఆరోపణలు చేశారని రిజిజు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ హక్కులను ఉల్లంఘిస్తూ.. కేంద్రమంత్రిపై చేసిన ఆరోపణలకు గానూ విపక్ష నేతపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు జారీ చేస్తామన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్నప్పటికీ రాహుల్ తాను అడిగిన ప్రశ్నలకు ఇతరులు చెప్పే సమాధానాలు వినకుండానే సభ నుంచి వెళ్లిపోతారని మండిపడ్డారు. ఒక సభ్యుడు ప్రసంగం చేసిన వెంటనే సభ నుంచి బయటకు వెళ్లకూడదనే నియమం ఉందని ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు.

# దేశంలోనే మొట్టమొదటి మ్యూజికల్ రోడ్డు ప్రారంభం.. ఎక్కడంటే?

భారత్‌లో తొలి మ్యూజికల్ రోడ్డును ప్రారంభించి ముంబయి కోస్టల్ రోడ్ అధికారులు రికార్డు సృష్టించారు. హంగేరియన్ టెక్నాలజీ సాయంతో నారిమన్ ప్రాంతం నుంచి వర్లి వైపు వెళ్లే రహదారిపై పలు సంగీత స్ట్రిప్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఈ రోడ్డుపై దాదాపు 700 మీటర్ల మేర వాహనదారులకు 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమాలోని 'జయ హో' పాట వినిపించనుంది. ఈ పాటను దేశానికి అంకితం చేయడానికి, ప్రజల్లో దేశభక్తి భావాన్ని మరింత పెంచేందుకు ఈ విధంగా డిజైన్ చేసినట్లు ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రూ.6.21 కోట్ల వ్యయం అయినట్లు అధికారులు వెల్లడించారు. ముంబయి కోస్టల్ రోడ్ కారిడార్ ప్రాజెక్ట్‌లలో భాగంగా నిర్మించిన ఈ రహదారి దేశంలోనే మొదటి మ్యూజికల్ రోడ్డుగా నిలుస్తుందన్నారు. ఇటువంటి మ్యూజికల్ రహదారులు హంగరీ, జపాన్, దక్షిణ కొరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో మాత్రమే ఉన్నాయన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఈరోజు దీనిని ప్రారంభించారు. ఏమిటీ కోస్టల్ రోడ్డు ప్రాజెక్ట్..? ముంబయిలోని వివిధ ప్రాంతాల మధ్య కనెక్టివిటీని పెంచడం, ట్రాఫిక్ రద్దీని అరికట్టడం కోసం



బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ కోస్టల్ రోడ్డు ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో భాగంగా దక్షిణ ముంబయిలోని మెరైన్ లైన్స్ నుంచి ఉత్తర శివారు ప్రాంతాలలోని దహిసర్ వరకు 29.2 కి.మీ మేర రోడ్డును నిర్మించింది. దీని కోసం మొత్తం రూ.14,000 కోట్లు ఖర్చు అయ్యింది. ఈ రోడ్డులోని కొంత భాగంలోనే వాహనదారులకు 'జయ హో' పాట మ్యూజిక్ వినిపించేలా అధికారులు డిజైన్ చేశారు.

# స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం.. నోటీసులో లోపాలు..!


లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను పదవి నుంచి తొలగించాలంటూ విపక్ష పార్టీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు మంగళవారం నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. కాగా ఆ నోటీసుల్లో లోపాలు ఉన్నట్లు లోక్‌సభ వర్గాలు వెల్లడించాయి. కొన్ని సందర్భాలను ప్రతిపక్ష సభ్యులు పదే పదే అందులో ప్రస్తావించినట్లు తెలిపాయి. అయితే.. ఆ నోటీసును పూర్తిగా తిరస్కరించడానికి బదులుగా అందులోని లోపాలను సవరించాలని స్పీకర్ ఓం బిర్లా సెక్రటేరియట్‌ను ఆదేశించినట్లు తెలుస్తోంది.



సవరించిన నోటీసు అందిన తర్వాత.. నిర్దేశించిన నిబంధనల ప్రకారం వాటిని పరిశీలిస్తామని అధికారులు పేర్కొన్నారు. మార్చి 9న బడ్జెట్ సెషన్ రెండో దశ ప్రారంభమైన తర్వాత ఈ నోటీసును జాబితా చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దూబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో విపక్షాలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేశాయి.

# ముంబయి మేయర్‌గా రితూ తావ్డే

ముంబయి మేయర్‌గా మహాయుతికి చెందిన రితూ తావ్డే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 25 ఏళ్లలో భాజపాకు ఈ పదవి దక్కడం ఇదే తొలిసారి. స్థానికంగా భాజపా సీనియర్ నేత అయిన రితూ .. ఘట్కోపర్ వెస్ట్ నుంచి మూడుసార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్



విద్యా కమిటీ అధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం కూడా ఆమెకు ఉంది. వార్డు స్థాయిలో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. కాగా, 227 సీట్ల బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 89 సీట్లు భాజపా గెలుచుకోగా శిందే సేన 29 స్థానాల్లో విజయం సాధించింది.

# జనగణమన కంటే ముందు వందేమాతరం ఆలపించాలి: కేంద్రం

అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో ఇక నుంచి జాతీయ గీతం జనగణమన కంటే ముందుగా జాతీయ గేయం వందేమాతరం ఆలపించాలని కేంద్రం పేర్కొంది. ఈ మేరకు బుధవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కొత్త నిబంధలను అమల్లోకి తెచ్చింది. వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో అందరూ లేచి నిలబడాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అంతేకాకుండా అన్ని పౌర పురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లోనూ వందేమాతరం ఆలపించాలని తెలిపింది. అయితే, సినిమా హాళ్లు వంటి ప్రదేశాల్లో దీన్ని ప్రదర్శించే సమయంలో ప్రేక్షకులు తప్పనిసరిగా లేచి నిలబడాల్సిన అవసరం లేదని స్పష్టంచేసింది. జాతీయ గీతం, గేయం పాడుతుండగా.. అంతరాయం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. కొత్త నిబంధనల కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ల పాటు జైలుశిక్ష విధించనున్నారు. ఇదిలా ఉంటే.. బంకించంద్ర ఛటర్జీ తొలుత 1875లో వందేమాతరాన్ని రచించారు. తర్వాత తన ఆనంద్‌మఠ్ నవలలో దీన్ని భాగం చేశారు. అయితే, స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటించింది.



ఈ గేయం ఆరు చరణాలుగా ఉండగా.. అందులో మతపరమైన ప్రస్తావన లేని రెండు భాగాలను మాత్రమే నాటి ప్రభుత్వం స్వీకరించింది. అయితే, తాజాగా 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆరు చరణాలనూ పాడాలని సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# ఇరాన్ యూ టర్న్.. దేశ ప్రజలకు ప్రధాని క్షమాపణలు

ఇటీవల ఇరాన్‌లో జరిగిన నిరసనల సందర్భంగా ప్రభుత్వ భద్రతా దళాలు నిరసనకారులపై హింసాత్మక, కఠిన చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇరాన్ నిర్ణయాన్ని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ ప్రధాని మసౌద్ పెజిష్కియాన్ దేశ ప్రజలను క్షమాపణలు కోరారు. నిరసనల సమయంలో కొన్ని చోట్ల పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడం, అరెస్టులు చేయడం, ప్రజలను చెదరగొట్టడం వంటి సంఘటనలు జరిగాయి. ఈ చర్యల వల్ల సాధారణ ప్రజలు



ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కొన్ని కుటుంబాలు బాధపడ్డాయని ఆయన అంగీకరించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు తమ అభిప్రాయాలను చెప్పే హక్కు ఉందని, ఆ హక్కును గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రధాని పేర్కొన్నారు.

## మూడు రోజుల లాభాలకు బ్రేక్...

**ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**స్వల్ప నష్టాలతో సెన్సెక్స్, లాభాలతో నిఫ్టీ**

**భారీగా నష్టపోయిన ఐటీ రంగ షేర్లు, లాభపడ్డ ఆటో, ఫార్మా**

**డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడిన రూపాయి**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లలో మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. బుధవారం ట్రేడింగ్‌లో సూచీలు రోజంతా లాభనష్టాల మధ్య ఊగిసలాడి చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. కీలకమైన ద్రవ్యోల్బణ (సీపీఐ) గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో మార్కెట్లో మిశ్రమ ధోరణి కనిపించింది.

ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 40 పాయింట్ల స్వల్ప నష్టంతో 84,233 వద్ద స్థిరపడింది. అయితే, నిఫ్టీ 18 పాయింట్లు లాభపడి 25,953 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్లు కూడా దాదాపు ఫ్లాట్‌గానే కదలాడాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.03 శాతం లాభపడగా, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.02 శాతం పెరిగింది. బీఎస్ఈలో 1,701 షేర్లు లాభపడగా, 2,259 షేర్లు నష్టాల్లో ముగిశాయి. దీంతో మార్కెట్ బ్రెడ్త్ నెగిటివ్‌గా నమోదైంది.

రంగాల వారీగా చూస్తే, ఐటీ, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు మినహా మిగిలినవన్నీ లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ ఐటీ సూచీ 1.76 శాతం మేర నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. మరోవైపు, నిఫ్టీ ఆటో 1.30 శాతం, ఫార్మా 1.01 శాతం, పీఎస్‌యూ బ్యాంక్ 1.03 శాతం చొప్పున లాభపడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.13 పైసలు బలహీనపడి 90.68 వద్ద ట్రేడయ్యింది. అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాలు, పెరుగుతున్న ముడిచమురు ధరలు రూపాయిపై ఒత్తిడి పెంచుతున్నాయి.

మార్కెట్ స్పష్టమైన దిశానిర్దేశం చేసేంత వరకు పరిమిత శ్రేణిలోనే కదలాడవచ్చని, స్టాక్ ఆధారిత కదలికలే ఎక్కువగా ఉంటాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. బ్యాంక్ నిఫ్టీ 60,750 వద్ద ముగిసి, 60,500 మద్దతు స్థాయిని నిలబెట్టుకుంది.

## 'సర్వం ఏఐ'.. ప్రపంచ దేశాలకు పోటీగా భారత్ స్వదేశీ ఏఐ

**దేశాల మధ్య శక్తి పోరాటంగా మారిన ఏఐ**

**డిజిటల్ ప్రపంచంపై ఆధిపత్యం కోసం పోటీ**

**'సర్వం ఏఐ'ని రూపొందిస్తున్న భారత్**




**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధస్సు (ఏఐ) ఇప్పుడు కేవలం టెక్నాలజీ మాత్రమే కాదు... ఇది దేశాల మధ్య శక్తి పోరాటంగా మారింది. ఎవరు అత్యాధునిక ఏఐ వ్యవస్థలను తయారు చేస్తారు? ఎవరి నియంత్రణలో భవిష్యత్ డిజిటల్ ప్రపంచం ఉంటుంది? అన్న ప్రశ్నల చుట్టూ ప్రపంచ శక్తులు పోటీ పడుతున్నాయి. అమెరికా, చైనా, యూరప్, భారత్... ఈ నాలుగు శక్తులు నాలుగు విధానాలతో ముందుకు సాగుతున్నాయి. తాజాగా 'సర్వం ఏఐ' మోడల్ తో భారత్ కూడా ఈ పోటీలో తనదైన పంథాను ఎంచుకుంది.

భారత్ ఇప్పుడే పూర్తి స్థాయి ఏఐ శక్తిగా ఎదగకపోయినా, వేగంగా ముందుకు సాగుతోంది. స్టాన్‌ఫర్డ్ గ్లోబల్ ఏఐ వైబ్రెన్సీ ర్యాంకింగ్స్ ప్రకారం అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. ఏఐని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, భారతీయ భాషలకు ప్రాధాన్యతనివ్వడం, సామాజిక సమస్యలకు పరిష్కారాలు, 22 షెడ్యూల్ భాషలకు మద్దతు, విదేశీ ఏఐపై ఆధారపడడాన్ని తగ్గించడం, దేశీయ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, 'బుల్ బుల్ వీ3' వంటి భాషా మోడళ్లను అభివృద్ధి పరచడం వంటి లక్ష్యలతో భారత్ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలోనే 'సర్వం ఏఐ' ప్రారంభమయింది. భారతీయ అవసరాలకు పూర్తిగా సరిపోయే ఏఐగా ఇది రూపొందుతోంది.

## టెక్ చరిత్రలో అరుదైన ఘట్టం..

**వందేళ్ల బాండ్ జారీ చేసిన గూగుల్**

**ఏఐ విస్తరణ కోసం భారీగా నిధులు సమీకరించిన ఆల్ఫాబెట్**

**24 గంటల్లోనే వివిధ మార్కెట్ల నుంచి 32 బిలియన్ డాలర్ల సేకరణ**

**వందేళ్ల కాలపరిమితితో ప్రత్యేక 'సెంచరీ బాండ్' జారీ**

**ఏఐ, డేటా సెంటర్ల కోసం వి185 బిలియన్ల పెట్టుబడులే లక్ష్యం**

**ఆల్ఫాబెట్ బాండ్లకు ఇన్వెస్టర్ల నుంచి అనూహ్యమైన స్పందన**




**న్యూఢిల్లీ:** గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ ఇంక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు భారీ ప్రణాళికతో ముందుకొచ్చింది. ఈ క్రమంలో, రికార్డు స్థాయిలో దాదాపు 32 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 2.6 లక్షల కోట్లు) నిధులను కేవలం 24 గంటల్లోనే బాండ్ల రూపంలో సమీకరించింది. ఇందులో భాగంగా 100 ఏళ్ల కాలపరిమితితో 'సెంచరీ బాండ్' జారీ చేయడం టెక్ ప్రపంచంలో సంచలనంగా మారింది.

ఫిబ్రవరి 9, 10 తేదీల్లో ఆల్ఫాబెట్ ఈ భారీ రుణ సమీకరణను పూర్తి చేసింది. అమెరికా మార్కెట్లో 20 బిలియన్ డాలర్లు, బ్రిటన్ మార్కెట్లో 5.5 బిలియన్ పౌండ్లు (సుమారు 7.53 బిలియన్ డాలర్లు), స్విస్ మార్కెట్లో 3.055 బిలియన్ ఫ్రాంకుల రూపంలో బాండ్లను విక్రయించింది. ముఖ్యంగా, బ్రిటన్‌లో జారీ చేసిన బాండ్లలో ఒక బిలియన్ పౌండ్ల విలువైన 100 ఏళ్ల 'సెంచరీ బాండ్' కూడా ఉంది. 1990ల తర్వాత ఒక పెద్ద టెక్ కంపెనీ ఇలాంటి సుదీర్ఘకాలిక బాండ్‌ను జారీ చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం.

ఏఐ రంగంలో పెరుగుతున్న పోటీని తట్టుకుని, తన జెమినీ మోడల్, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మరింత విస్తరించడమే లక్ష్యంగా ఆల్ఫాబెట్ ఈ నిధులను సమీకరించింది. 2026 సంవత్సరంలో సుమారు 185 బిలియన్ డాలర్ల మూలధన వ్యయం (క్యాపెక్స్) చేయాలని కంపెనీ అంచనా వేస్తోంది. ఇది గత ఏడాది కంటే దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. ఈ నిధులను ప్రధానంగా ఏఐ సామర్థ్యాలను పెంచేందుకు, కొత్త డేటా సెంటర్ల నిర్మాణానికి ఉపయోగించనుంది.

## ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ హవా...

**అగ్రస్థానాల్లో అభిషేక్, వరుణ్ చక్రవర్తి**

**ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న అభిషేక్ శర్మ, వరుణ్ చక్రవర్తి**

**ఆల్‌రౌండర్ల జాబితాలో నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్న సికందర్ రజా**

**టీ20 ప్రపంచకప్‌లో ప్రదర్శనతో పాక్ ఆటగాడిని వెనక్కి నెట్టిన జింబాబ్వే కెప్టెన్**

**ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానాలు దక్కించుకున్న ఇషాన్ కిషన్, అర్ష్‌దీప్ సింగ్**




**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ బ్యాటర్ల జాబితాలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, బౌలర్ల జాబితాలో వరుణ్ చక్రవర్తి నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు, జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్రస్థానానికి దూసుకొచ్చాడు.

బ్యాటర్ల జాబితాలో అభిషేక్ శర్మ 909 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇంగ్లండ్‌కు చెందిన ఫిల్ సాల్ట్ (821), పాకిస్థాన్ ఆటగాడు సాహిబ్జాదా ఫర్హాన్ (769) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. భారత వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ ఏడు స్థానాలు ఎగబాకి 25వ ర్యాంకుకు చేరుకున్నాడు.

బౌలర్ల విభాగంలో వరుణ్ చక్రవర్తికి, రెండో స్థానంలో ఉన్న పాకిస్థాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్‌కు మధ్య స్వల్ప తేడా మాత్రమే ఉంది. శ్రీలంక ఆల్‌రౌండర్ వనిందు హసరంగ ఒక స్థానం మెరుగుపరుచుకుని ఐదో ర్యాంకుకు చేరాడు. భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ మూడు స్థానాలు ఎగబాకి 11వ ర్యాంకులో నిలిచాడు.

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన సికందర్ రజా, పాకిస్థాన్ ఆటగాడు సైమ్ అయూబ్‌ను వెనక్కి నెట్టి ఆల్‌రౌండర్ల జాబితాలో తిరిగి నంబర్ వన్ కిరీటాన్ని దక్కించుకున్నాడు. ఈ మ్యాచ్‌లో రజా, బౌలింగ్‌లో 4 ఓవర్లలో 17 పరుగులిచ్చి ఒక వికెట్ తీయడంతో పాటు, బ్యాటింగ్‌లోనూ రాణించి జట్టుకు విజయాన్ని అందించాడు. గతేడాది చివర్లో తొలిసారి ఈ ఘనత సాధించిన రజా, మళ్లీ ఇప్పుడు అగ్రస్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం.




## టీ20 వరల్డ్‌కప్‌లో సూపర్ థ్రిల్లర్..

**రెండో సూపర్ ఓవర్‌లో నెగ్గిన దక్షిణాఫ్రికా**

**అహ్మదాబాద్:** టీ20 వరల్డ్‌కప్‌లో ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన మ్యాచ్‌లో హైడ్రామా చోటుచేసుకున్నది. సూపర్ థ్రిల్లింగ్‌గా సాగిన ఈ మ్యాచ్‌లో రెండు సార్లు సూపర్ ఓవర్ వరకు వెళ్లింది. చివరకు దక్షిణాఫ్రికా రెండో సూపర్ ఓవర్‌లో 4 రన్స్ తేడాతో విక్టరీ నమోదు చేసింది. ఈ వరల్డ్‌కప్‌లో సూపర్ ఓవర్ వరకు వెళ్లిన తొలి మ్యాచ్ ఇదే. భారీ పవర్ హిట్టర్లు ఉన్న రెండు జట్లు.. మ్యాచ్‌పై చివరి వరకు తమ పట్టును కోల్పోలేదు. ఈ మ్యాచ్‌లో సిక్సర్ల వర్షం కురిసింది. ఫస్ట్ మ్యాచ్‌లో రెండు జట్లు కలిపి 20 సిక్సర్లు కొట్టాయి. ఇక సూపర్ ఓవర్స్‌లో మరో 10 సిక్సర్లు బాదాయి. అహ్మదాబాద్ స్టేడియం బౌండరీల మోతతో హోరెత్తింది.

ఫస్ట్ బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 187 రన్స్ చేసింది. క్వింటెన్ డికాక్ 59, రికల్టన్ 61 రన్స్ చేశారు. అయితే చేజింగ్ మొదలుపెట్టిన ఆఫ్ఘనిస్తాన్‌కు గుర్బాజ్ మంచి స్టార్ట్ ఇచ్చాడు. అతను 42 బంతుల్లో 84 రన్స్ చేశాడు. అజ్మతుల్లా, రషీద్ ఖాన్ కూడా చెలరేగిపోయారు. దీంతో మ్యాచ్ ఆఫ్ఘన్ గెలుస్తుందనుకున్నారు. కానీ ఆఖరి ఓవర్లో 13 రన్స్ అవసరం కాగా .. మ్యాచ్ టై అయ్యింది. 19.4 ఓవర్లలో 187 రన్స్ చేసి ఆఫ్ఘనిస్తాన్ ఆలౌటైంది. మ్యాచ్ టై కావడంతో సూపర్ ఓవర్‌కు వెళ్లింది.



ఇక ఫస్ట్ సూపర్ ఓవర్‌లో ముందుగా ఆఫ్ఘనిస్తాన్ బ్యాటింగ్ చేసింది. ఆ ఓవర్‌లో 17 రన్స్ చేసింది ఆఫ్ఘనిస్తాన్. అజ్మతుల్లా 5 బంతుల్లో 16 రన్స్ చేశాడు. అయితే ఆ టార్గెట్‌ను అనూహ్య రీతిలో ఛేజ్ చేసింది దక్షిణాఫ్రికా. ఆఖరి బంతికి భారీ సిక్సర్ కొట్టిన స్టబ్స్ ఫస్ట్ సూపర్ ఓవర్‌ను తమ ఖాతాలో వేసుకున్నాడు.

రెండో సూపర్ ఓవర్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 23 రన్స్ చేసింది. స్టబ్స్ ఓ సిక్సర్ బాదగా, మిల్లర్ రెండు భారీ సిక్సర్లు కొట్టేశాడు. ఇక చేజింగ్‌లో గుర్బాజ్ వరుసగా మూడు సిక్సర్లు కొట్టి దక్షిణాఫ్రికాను వణికించాడు. కానీ ఆఖరి బంతికి క్యాచ్ అవుట్ కావడంతో 4 రన్స్ తేడాతో సఫారీలు విక్టరీ కొట్టారు.

## టీమిండియా మాపై 250 కొట్టే ప్రశ్నే లేదు

**నమీబియా యువ ఫాస్ట్ బౌలర్ ధీమా**

**టీమిండియాను 180 పరుగులకే పరిమితం చేస్తామన్న మాక్స్ హీంగో**

**భారత్‌లో 50 వేల మంది ప్రేక్షకుల మధ్య ఆడటం ఒత్తిడేనని అంగీకారం**

**గత మ్యాచ్‌లో ఒకే ఒక్క క్యాచ్ డ్రాప్ వల్ల ఓడిపోయామని విచారం**

**కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ అనుభవం తమకు ఎంతో ఉపయోగపడుతోందని వెల్లడి**



**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్‌లో భాగంగా రేపు గురువారం నాడు అరుణ్ జైట్లీ స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌తో ఆఫ్రికా పసికూన నమీబియా తలపడనుంది. అయితే, ఈ మ్యాచ్‌లో టీమిండియాను 180 పరుగులకే కట్టడి చేస్తామని నమీబియా 18 ఏళ్ల యువ ఫాస్ట్ బౌలర్ మాక్స్ హీంగో ధీమా వ్యక్తం చేశాడు. టీమిండియా బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉన్నప్పటికీ, తమ బౌలింగ్‌తో వారిని తక్కువ స్కోరుకే పరిమితం చేయగలమని అన్నాడు.

"భారత్ మాపై 250 పరుగులకు పైగా స్కోర్ చేసే ప్రసక్తే లేదు. బహుశా వారు 180 పరుగులు చేయొచ్చు. కానీ, 300 పరుగులు మాత్రం అస్సలు చేయలేరు" అని మ్యాచ్‌కు ముందు ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హీంగో పేర్కొన్నాడు. నెదర్లాండ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో నమీబియా ఏడు వికెట్ల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే.

భారత్‌లో, వారి సొంత ప్రేక్షకుల మధ్య ఆడటంపై హీంగో స్పందిస్తూ.. "50 వేల మంది ప్రేక్షకుల మధ్య ఆడటం ఒత్తిడితో కూడుకున్నప్పటికీ, ఇది ఒక అద్భుతమైన అనుభూతి. నాలో కంగారు ఉన్నా, నా నైపుణ్యాలను ప్రదర్శించడానికి సిద్ధంగా ఉన్నాను. నా సహచరులు నాకు ధైర్యం చెబుతున్నారు" అని తెలిపాడు. నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒకే ఒక్క క్యాచ్ డ్రాప్ కారణంగా ఓడిపోయామని, ఇది తమను నిరాశపరిచిందని అన్నాడు.


భారత్‌కు 2011 వన్డే ప్రపంచకప్ అందించిన గ్యారీ కిర్‌స్టెన్ తమ జట్టుకు కన్సల్టెంట్ కోచ్‌గా ఉండటం ఎంతో మేలు చేస్తోందని, ఆయన అనుభవం జట్టుకు ఉపయోగపడుతోందని హీంగో వివరించాడు. పేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన హీంగో, తన పాఠశాలలో క్రికెట్ ఆడటం మొదలుపెట్టి, ప్రతిభతో జాతీయ జట్టులో చోటు సంపాదించాడు.

## భారత్, పాకిస్థాన్ మ్యాచ్.. కొలంబోకు మూడింతలు పెరిగిన విమాన టిక్కెట్ ధరలు

**ఈ నెల 15న కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ మ్యాచ్**

**ఢిల్లీ నుంచి కొలంబోకు రూ.90,000కు పెరిగిన ఛార్జీలు**

**ఢిల్లీ నుంచి రూ.2,25,000కు పెరిగిన బిజినెస్ క్లాస్ ఛార్జీ**




**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా ఈ నెల 15న కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ తలపడనున్నాయి. టీమిండియాతో మ్యాచ్ ఆడేందుకు సిద్ధమని రెండు రోజుల క్రితం పాకిస్థాన్ ప్రకటించింది. దీంతో కొలంబోకు విమాన టిక్కెట్ ధరలు అమాంతం పెరుగుతున్నాయి. ముంబై-కొలంబో-ముంబై విమాన టిక్కెట్ ధర నిన్న ఉదయం రూ.60,000గా ఉండగా, ఈరోజు మరింత పెరిగింది.

ముంబై నుంచి కొలంబోకు ఎకానమీ టిక్కెట్ ధర రూ.60,000 ఉండగా, ప్రీమియం ఎకానమీ ధర రూ.84,000గా ఉంది. శ్రీలంక ఎయిర్ లైన్స్‌లో ముంబై-కొలంబో విమానం టిక్కెట్ ధర రూ.63,340, బిజినెస్ క్లాస్ టిక్కెట్ ధర రూ.1,34,157గా ఉంది.

సాధారణంగా ఢిల్లీ-కొలంబో టిక్కెట్ ధర రూ.30,000 ఉండగా, ఇప్పుడు రూ.90,000కు చేరుకుంది. బిజినెస్ క్లాస్ టిక్కెట్ ధరలు రూ.1,92,000 నుంచి రూ.2,25,000 వరకు పలుకుతున్నాయి.

మొదట భారత్‌తో మ్యాచ్ ఆడబోమని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. పలు దఫాలుగా చర్చలు జరిగిన అనంతరం టీమిండియాతో మ్యాచ్ ఆడేందుకు పాకిస్థాన్ అంగీకరించి ఉత్కంఠకు తెరదించింది. దీంతో శ్రీలంకకు విమాన టిక్కెట్ల ధరలు, కొలంబోలో హోటల్ వంటి వసతి ధరలు కూడా పెరుగుతున్నాయి.

ఫిబ్రవరి 14, 15 తేదీల్లో ప్రీమియం త్రీ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లలో ఒకరోజుకు డబుల్ బెడ్ రూమ్‌ల ధరలు రూ.1.05 లక్షల నుంచి రూ.1.06 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. డిమాండ్ లేని సమయాల్లో ఈ ధర రూ.40,000 నుంచి రూ.50,000 వరకు ఉంటుంది.


# MOVIE TIME

## 'వన్ పీస్' సీజన్ 2 ట్రైలర్ రిలీజ్




**టాకీస్:** ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన లైవ్-యాక్షన్ సిరీస్ 'వన్ పీస్' రెండో సీజన్ రాబోతుంది. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల కొద్దీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సీజన్ 2 మార్చి 10న స్ట్రీమింగ్ కాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. మొదటి సీజన్ సాధించిన భారీ విజయం తర్వాత వస్తున్న చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ తాజా ట్రైలర్‌లో మంకీ డి. లూఫీ మరియు అతని 'స్ట్రా హాట్' గ్యాంగ్ అత్యంత ప్రమాదకరమైన 'గ్రాండ్ లైన్' సముద్ర మార్గంలోకి ప్రవేశించడంతో పాటు. ప్రపంచంలోనే అత్యంత విలువైన నిధి 'వన్ పీస్' కోసం వారు సాహసం చేయబోతున్నారు. ఈ ప్రయాణంలో వింతైన దీవులు, ఊహించని శత్రువులు మరియు అద్భుతమైన సాహసాలు ఎదురుకాబోతున్నాయి. మొదటి సీజన్ కంటే ఈసారి యాక్షన్, సస్పెన్స్ మరింత రెట్టింపు ఉండబోతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. జపనీస్ రచయిత్రి ఐచిరో ఓడా రాసిన ప్రపంచంలోనే అత్యధికంగా అమ్ముడైన మాంగా ఆధారంగా రూపొందిన ఈ సిరీస్, 2023లో విడుదలైన మొదటి సీజన్‌తోనే 75 దేశాల్లో నంబర్ వన్ స్థానంలో నిలిచి గ్లోబల్ ఫినామినన్‌గా మారింది. ముఖ్యంగా కొత్త సీజన్‌లో అభిమానులందరికీ ఇష్టమైన 'టోనీ టోనీ చాపర్' పాత్ర లైవ్-యాక్షన్‌లో ఎంట్రీ ఇస్తుండడం విశేషం.

## పవన్, సురేందర్ రెడ్డి కాంబో పక్కా మాస్ ఎంటర్టైనర్ మూవీ



**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ఈ భారీ ప్రాజెక్ట్ గురించి ఫిలిం నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. సాధారణంగా సురేందర్ రెడ్డి అంటే స్టైలిష్ యాక్షన్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాడు. కానీ ఈసారి పవన్ కళ్యాణ్ కోసం ఆయన తన పంథాను పూర్తిగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. పవన్ చేసిన యాక్షన్ సినిమా కంటే భిన్నంగా గతంలో సురేందర్ రెడ్డి అందించిన 'కిక్', 'రేసుగుర్రం' తరహాలో పక్కా హై-వోల్టేజ్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను పవన్ కోసం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే మేనరిజమ్స్‌తో కూడిన వినోదాన్ని వెలికితీయడమే లక్ష్యంగా రచయిత వక్కంతం వంశీ ఈ స్క్రిప్ట్‌ను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాలో పవన్‌కు జోడీగా ప్రభాస్ 'ఫౌజీ' సినిమా హీరోయిన్ ఇమాన్వీ పేరు ప్రముఖంగా వినిపిస్తుండటం విశేషం. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించి మరో క్రేజీ అప్‌డేట్ ఏమిటంటే, ఇందులో పవన్ కళ్యాణ్‌కు తమ్ముడిగా ఒక యువ అగ్ర హీరో నటించే అవకాశం ఉందని, అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో సాగే పక్కా మాస్ మూవీగా ఇది ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్.



# ఇక డాక్టర్ శ్రీలీల

### ఎంబీబీఎస్ పట్టా పుచ్చుకున్న నటి

**టాకీస్:** టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల తన జీవితంలో ఒక అద్భుతమైన ఘట్టాన్ని పూర్తిచేసుకుంది. వెండితెరపై నటిగా అలరిస్తున్న ఆమె, ఇప్పుడు అధికారికంగా డాక్టర్ శ్రీలీలగా మారారు. తన మెడికల్ డిగ్రీని విజయవంతంగా పూర్తి చేసిన శ్రీలీల తాజాగా కాన్వొకేషన్ వేడుకలో మెడిసిన్ పట్టాను అందుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు ఫొటోలు వైరల్‌గా మారాయి. నిజానికి శ్రీలీల తన తల్లి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలత గారిని స్ఫూర్తిగా తీసుకుని మెడిసిన్ వైపు అడుగులు వేశారు. గత ఏడాది చేతినిండా సినిమాలతో అత్యంత బిజీగా ఉన్నప్పటికీ, తన లక్ష్యం కోసం చదువుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఒక్కోసారి రోజంతా షూటింగ్‌లతో బిజీగా ఉంటూనే, విరామ సమయంలో పుస్తకాలు చదువుతూ ఆమె పడ్డ శ్రమ ఇప్పుడు ఫలించింది. చిన్నతనంలో తన అమ్మమ్మ అనారోగ్యం పాలైనప్పుడు ఒక వైద్యురాలిగా సేవ చేయాలన్న తన కోరికను ఆమె నేడు నెరవేర్చుకున్నారు.

## తెలుగు తెరపై అందమైన వారసత్వం

### తెలుగులో ఎంట్రీ ఇస్తున్న ఐశ్వర్య అర్జున్

**టాకీస్:** స్టార్ హీరోల వారసుల పిల్లలు హీరోలుగా తమ జోరు చూపించడం చాలా కాలం నుంచి ఉన్నదే. అయితే స్టార్ హీరోల కూతుళ్లు మాత్రం హీరోయిన్ కావాలనే ఆలోచన చేసేవారు కాదు. అందుకు అనేక కారణాలు కనిపిస్తాయి. అయితే అలాంటి కాలం గతంలోకి జారిపోయి చాలాకాలమే అవుతోంది. సీనియర్ స్టార్ హీరోల కూతుళ్లు హీరోయిన్స్ గా తెరపై సందడి చేయడానికి ఉత్సాహాన్ని కనబరుస్తూ వస్తున్నారు.

అలాంటి హీరోయిన్స్ జాబితాలో ఇప్పుడు అర్జున్ కూతురు ఐశ్వర్య కూడా చేరిపోయింది. ఐశ్వర్య 2013లోనే ఎంట్రీ ఇచ్చింది. అయితే కెరియర్ ను ఆమె సీరియస్ గా తీసుకున్నట్టుగా కనిపించలేదు. తమిళ .. కన్నడ భాషల్లో మాత్రమే రెండు మూడు సినిమాలు చేసిన ఆమె, ఇప్పుడు 'సీతా పయనం' అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నెల 14వ తేదీన ఈ సినిమాను భారీ స్థాయిలో రిలీజ్ చేస్తున్నారు.

ఇది ప్రేమకథా చిత్రం .. ఈ సినిమాకి అర్జున్ దర్శకత్వం వహించడం విశేషం. తండ్రి దర్శకత్వంలో లవ్ స్టోరీస్ చేయవలసి రావడం నిజానికి కాస్త ఇబ్బందిని కలిగించే విషయమే. అయినా అర్జున్ ను ఒక దర్శకుడిగా మాత్రమే భావిస్తూ ఐశ్వర్య ఈ సినిమా చేసింది. గ్లామర్ పరంగా ఐశ్వర్యకి వంక బెట్టాల్సిన అవసరం లేదు. మరి నటన పరంగా ఎన్ని మార్కులు పడతాయనేది చూడాలి. అర్జున్ చాలా కసరత్తు చేసి తీసిన ఈ సినిమా, ఎలాంటి ఫలితాన్ని రాబడుతుందనేది చూడాలి.




## వెంకీ మామ కోసం స్క్రిప్ట్ వర్క్‌లో అనుదీప్..

### గ్రీన్ సిగ్నల్ ఇచ్చేనా?

**టాకీస్:** టాలీవుడ్‌లో కామెడీకి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే విక్టరీ వెంకటేష్, తనదైన మార్క్ 'సెటైరికల్' హాస్యంతో ప్రేక్షకులను అలరించే దర్శకుడు కేవీ అనుదీప్ చేతులు కలపబోతున్నట్లు తెలుస్తోంది. 'జాతిరత్నాలు' సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేసిన అనుదీప్, ప్రస్తుతం మాస్ కా దాస్ విశ్వక్ సేన్‌తో తెరకెక్కించిన 'ఫంకీ' సినిమాను విడుదలకు సిద్ధం చేస్తున్నాడు. ఈ సినిమా ప్రమోషన్స్ సందర్భంగా అనుదీప్ తన తదుపరి చిత్రాలపై స్పందిస్తూ, వెంకటేష్ గారి కోసం ఒక ప్రత్యేకమైన కథను సిద్ధం చేస్తున్నట్లు స్వయంగా వెల్లడించారు.


గతంలో అనుదీప్ వెంకటేష్‌కు ఒక కథను వినిపించగా, ఆయన సానుకూలంగా స్పందించారని సమాచారం. అయితే, స్క్రిప్ట్‌లో మరిన్ని మెరుగులు దిద్దాలని వెంకీ సూచించడంతో, ప్రస్తుతం అనుదీప్ ఆ పనుల్లో నిమగ్నమై ఉన్నట్లు తెలుస్తోంది. ఫైనల్ వెర్షన్ సిద్ధమయ్యాక మరోసారి నేరేషన్ ఇచ్చి గ్రీన్ సిగ్నల్ తీసుకోవాలని దర్శకుడు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మించే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. వెంకీమామ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం' అనే ఫ్యామిలీ క్రైమ్ కామెడీ సినిమాలో నటిస్తున్నారు. దీనితో పాటు అనిల్



రావిపూడి డైరెక్షన్‌లో ఒక ఎంటర్‌టైనర్, అలాగే 'దృశ్యం 3' కూడా లైన్‌లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయిన తర్వాతే అనుదీప్ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది.

## నిఖిల్ స్వయంభు టీజర్ విడుదల

**టాకీస్:** యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'స్వయంభు'. సమ్మర్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో, 3ఆ ఫార్మాట్‌లో రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నిఖిల్ క్రీస్తుశకం 985 నాటి పరాక్రమవంతుడైన యోధుడిగా కనిపిస్తున్నారు. భారీ సెట్టింగ్‌లు, అద్భుతమైన పీరియడ్ వార్ సీక్వెన్స్‌లతో కూడిన ఈ టీజర్, నిఖిల్ మేకోవర్ మరియు ఆయన యుద్ధ విన్యాసాలను అద్భుతంగా ఆవిష్కరించింది. సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ విజువల్స్ సమకూర్చారు. 'కార్తికేయ-2' విజయం తర్వాత నిఖిల్ నటిస్తున్న ఈ చిత్రంపై టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.